## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:05 | సంచిక:18 | గురువారం ఆగస్ట్ 27, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


## సీజేపీ నిరసనల తర్వాత..

### ఇన్‌స్టాలో పెరిగిన మోదీ, రాహుల్ క్రేజ్

దిల్లీలో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన అనంతరం జెన్‌జీకి దగ్గరకావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు వీడియోలు షేర్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. పలువురు కేంద్రమంత్రులు కూడా యువతతో మమేకమవ్వడానికి ఆసక్తి చూపించారు.



2లో

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్-బి పోస్టుల నియామక ప్రక్రియను మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌రద్దు చేసింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షల చొప్పున అమ్మేశారని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. పేజి 2లో ▶



# నాగార్జునసాగర్‌లో మళ్లీ జల వివాదం..

## బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటి విడుదల

- నాగార్జునసాగర్ వద్ద మరోసారి జల వివాదం
- ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీలు
- ఏపీ వాటా నీరు ఇప్పటికే పూర్తి వినియోగం
- అనుమతి లేకుండా 1,600 క్యూసెక్కుల విడుదల ఆరోపణ
- తెలంగాణ వాటాలో ఇంకా నీరు మిగిలి ఉంది
- తెలంగాణ 1,000 క్యూసెక్కుల నీరు విడుదల
- ఏపీ తీరుపై తెలంగాణ అధికారుల అభ్యంతరం







నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ దగ్గర మరోసారి జల వివాదం తెరపైకి వచ్చింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, వినియోగంపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మే నెలలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీడీ) సమావేశంలో ఇరు రాష్ట్రాలకు నీటిని కేటాయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీల నీటిని కేటాయించారు. అయితే ఏపీ తనకు కేటాయించిన 10 టీఎంసీల నీటిని ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంది.

ఈ తరుణంలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీడీ) ఎలాంటి అధికారిక అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ, ఏపీ ఇరిగేషన్ , జెన్‌కో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. కుడి కాలువ పవర్‌హౌస్ ద్వారా ఏకంగా 1600 క్యూసెక్కుల నీటిని ఏపీ అధికారులు విడుదల చేశారు.

మరోవైపు, తెలంగాణకు ఇంకా నీటి వాటా మిగిలి ఉండటంతో.. స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ వాటాలో భాగంగా ఎడమ కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నిబంధనలకు విరుద్ధంగా, బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటిని విడుదల చేయడంపై ఇప్పుడు తీవ్ర వివాదం చెలరేగింది.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్న న్యూయార్క్ మేయర్‌పై కిషన్‌రెడ్డి మండిపాటు

### మోహన్ భగవత్ కార్యక్రమంపై వివాదం

- 29న మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో కార్యక్రమం
- అడ్డుకుంటామని మమ్దానీ ప్రకటన
- మమ్దానీపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- ప్రకటన భారత్ వ్యతిరేకతకు నిదర్శనమని విమర్శ
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని ఆరోపణ



దిల్లీ: ఈనెల 29వ తేదీన అమెరికాలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగబోయే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన పట్ల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "భారతీయులనుద్దేశించి మోహన్ భగవత్ ప్రసంగించబోయే కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన ఆయన భారత వ్యతిరేకతకు అద్దంపడుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, భారత్‌లోని ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించే అసాంఘిక శక్తుల మెప్పు పొందేందుకు మోహన్ భగవత్ కార్యక్రమాలను అడ్డుకోవాలని అక్కడి మేయర్ నిర్ణయించారు. సమ్మిళిత సాంస్కృతిక సమావేశాలపై ఉద్దేశపూర్వకంగా దాడి చేస్తున్నారు. సాంస్కృతిక మూలాలు, వారసత్వాన్ని చూసి గర్వపడే భారతీయ అమెరికన్లు, ప్రవాస భారతీయులపట్ల మమ్దానీకున్న అసహనాన్ని ఈ ప్రకటన బహిర్గతం చేస్తోంది. ప్రజాస్వామ్య విలువలు, వసుధైక కుటుంబక సిద్ధాంతాన్ని పాటించే భారత్‌కు విద్వేషాలు, విభజనను ఆయుధంగా వాడుకొనే ఇలాంటి వారి నీతులు అవసరం లేదు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.






## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

### జీసీసీలకు హైదరాబాద్ తొలి ఎంపిక

- గతేడాది 75 జీసీసీలు రాక
- వచ్చే ఏడాది మరో 100 జీసీసీల లక్ష్యం
- హైటెక్ సిటీలో ఆక్టేవ్ కొత్త సెంటర్
- ఐటీతో పాటు పలు రంగాల్లో కంపెనీలు
- ఏఐ, డేటా, క్లౌడ్‌పై ఆక్టేవ్ దృష్టి
- హైదరాబాద్‌లో బలమైన టెక్ ఎకోసిస్టమ్

2లో



## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత



2లో



## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

- మూడు దశాబ్దాల కల నెరవేరుస్తున్న చంద్రబాబు
- నిర్వాసితుల త్యాగాలకు ప్రభుత్వం పాదాభివందనం
- 40 రోజుల్లోనే నిర్వాసితులకు 768 కోట్లు విడుదల

2లో

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

- ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు
- అసెంబ్లీకి రాకుండా ప్రెస్ మీట్లతో కాలయాపన
- సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వంలో భారీ నిధులు
- బీసీల సంక్షేమానికి కట్టుబడిన ప్రస్తుత ప్రభుత్వం



2లో

# సంపాదకీయం

## సైద్ధాంతిక రాజకీయాలు ఏవీ?

'పాతికేళ్ల క్రితం నేను మీ నాన్నను కలుసుకునేందుకు మీ ఇంటికి స్కూటర్‌పై వచ్చాను గుర్తుందా?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌కు చెందిన ఒక యువనేతను ఉద్దేశించి అన్నారు. 1991లో మురళీమనోహర్ జోషీతో పాటు ఏక్తా యాత్రకు సహాయంగా వచ్చినప్పుడు 'నీవు ఒక పిల్లవాడిగా మాకు ఫలహారాలు అందించావు' అని ఆయన మరో నేతకు చెప్పారు. '2014లో నేను ప్రధాని కాకముందు హైదరాబాద్ వచ్చినప్పుడు ఎల్బీ స్టేడియంలో యువసమ్మేళనం నీ ఆధ్వర్యంలోనే జరిగింది కదా, అప్పుడు టికెట్ పెట్టినా భారీ ఎత్తున యువత హాజరైంది' అని ఏపీకి చెందిన మరో నాయకుడితో మోదీ అన్నారు. కొత్తగా నియమితులైన బీజేపీ పదాధికారులతో దాదాపు నాలుగు గంటల పాటు మోదీ సమావేశమైనప్పుడు జరిగిన సంభాషణలివి. బీజేపీ పదాధికారులందర్నీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని దాదాపు 50 మందితో మాట్లాడనిచ్చిన మోదీ.. మధ్య మధ్యలో వారితో తన అనుబంధాన్ని, గత స్మృతులను నెమరు వేసుకున్నప్పుడు వారు ఆశ్చర్యపోయారు. కొంతమంది అయితే కన్నీరు కార్చారు. 'మోదీ జ్ఞాపకశక్తి అమోఘం' అని ఒక నేత చెప్పారు. 'కొత్త టీమ్ సమావేశం జరుగుతోంది సార్. మీరు వస్తే బాగుంటుంది అని నేనే ప్రధానికి చెప్పాను' అని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ చెప్పారు. 'కెప్టెన్ ఆదేశిస్తే రాకుండా ఎలా ఉంటాను.. మీ అందర్నీ కలుసుకుంటే ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య ఉన్నట్లుంటుంది' అని మోదీ నవ్వుతూ చెప్పారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, సిద్ధాంతకర్తగా పేరొందిన రాంమాధవ్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తదితర ఉద్దండులు కూడా మోదీ మాట్లాడుతుంటే తదేకంగా వింటూ కూర్చున్నారు. సమావేశం తర్వాత వారందరితో పాటు గ్రూప్ ఫోటో దిగారు. కలిసి భోజనం చేశారు. ఆశ్చర్యకమైన విషయం ఏమంటే, ఈ కీలక సమావేశంలో హోంమంత్రి అమిత్ షా పాల్గొనలేదు. గతంలో జగత్‌ప్రకాశ్ నడ్డా అధ్యక్షుడు అయిన తర్వాత ఆఫీసు బేరర్లను నియమించినప్పుడు మోదీ ఇలాంటి అసాధారణమైన రీతిలో వ్యవహరించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వారందర్నీ పిలిపించుకుని గ్రూపుల వారీగా ఫొటోలు దిగి పంపించేశారు. ఈసారి మోదీ తానే పార్టీ కార్యాలయానికి వచ్చి పాల్గొన్న ఈ సమావేశం ద్వారా పంపించిన సందేశం ఏమిటి? అందరి పుట్టుపూర్వోత్తరాల్ని పరిశీలించిన తర్వాతే వారిని తానే ఎంపిక చేశానని, ఇది తన టీమ్ అని మోదీ అప్రకటితంగానే స్పష్టం చేశారు. ప్రభుత్వానికైనా, పార్టీకైనా తానే నాయకుడినని, తానే రెండింటినీ నడిపిస్తానని, రెండో వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వనని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కావచ్చు. రానున్న రోజుల్లో వారికి బాధ్యతలు అప్పజెప్పే విషయంలో కూడా తన హస్తం ఉంటుందని ఆయన మాటల్లో పరోక్షంగా వ్యక్తం అయింది. గడచిన కొన్ని రోజులుగా దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పరిస్థితిని తన పూర్తి నియంత్రణలోకి తీసుకోవాలని నరేంద్రమోదీ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గత కొద్ది రోజులుగా ఆయన ఒక్కో కేంద్ర మంత్రిని పిలుచుకుని సుదీర్ఘంగా మాట్లాడుతున్నారు. త్వరలో మంత్రివర్గంలో భారీ మార్పులకు కూడా ఆయన రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇంతకీ.. పార్టీని, ప్రభుత్వాన్ని కొత్త రీతిలో, సైద్ధాంతికంగా పటిష్ఠం చేసే దిశలో మోదీ నడిపించదలుచుకున్నారా అన్నది ప్రశ్న. సైద్ధాంతికంగా ఆయన పార్టీ పదాధికారులకు చెప్పింది ఏమీ లేదు. దేశంలో ప్రస్తుత వివాదాలపై దృష్టి సారించకుండా వికసిత్ భారత్ పైనే ఆలోచించాలని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లాలని, యువతను విశ్వాసంలోకి తీసుకోవాలని, నిరాడంబరంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. యథాప్రకారం ఆయన తన నాయకత్వాన్నే పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. సెప్టెంబర్ 17న తన పుట్టిన రోజు సందర్భంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో ఉధృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంతేకాదు, తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుపుకోవాలని కూడా ఆయన నిర్ణయించారు.

బీజేపీ, కేంద్ర ప్రభుత్వం వ్యక్తి కేంద్రంగా ఎందుకు మారుతున్నాయి అన్న ప్రశ్నకు జవాబిచ్చే సిద్ధాంతకర్తలెవరూ ఆ పార్టీలో లేరు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ మోదీ తనను తాను కథానాయకుడిగా చిత్రించి అందరిలో ఆరాధనాభావం కల్పించాలని భావిస్తున్నట్లు మాత్రం స్పష్టమవుతోంది. పదాధికారుల సమావేశంలో బీజేపీ చేసిన ప్రధాన తీర్మానం వందేమాతర గీతం గౌరవాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకోవడం. వందేమాతర గీతాన్ని రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పదాధికారుల సమావేశం తీవ్రంగా ఖండించింది.

అసలు వందేమాతర గీతం పూర్తిగా పాడాలనడం దేశంలో జనాన్ని కదిలించి బీజేపీ ఆశిస్తున్న సాంస్కృతిక జాతీయవాదానికి దారి తీస్తుందా అన్నది చర్చనీయాంశం. ప్రజల్లో, ప్రధానంగా నేటి జెన్‌జీ లో వందేమాతరం రెండు చరణాలకు పరిమితం కాకుండా పూర్తిగా పాడాలని చట్టం చేయడం ఎంత భావోద్వేగాన్ని కలిగిస్తుందనేది కూడా అంచనా వేయవలిసి ఉన్నది. చట్టం ద్వారా జాతీయ ఐక్యతను సాధించగలమా? అయినప్పటికీ ఇది బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఒక సైద్ధాంతిక వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ నిజంగా ఈ రెండు పార్టీలు ఈ సైద్ధాంతిక దృక్పథంలో లోతుగా ఆలోచించి నిజాయితీగా పనిచేస్తున్నాయా అన్నది కూడా ఆలోచించాల్సి ఉన్నది.

## వివాహ వేడుకలో వధూవరులను ఆశీర్వదించిన





**పొత్తూరి రామరాజు**

**మొగల్తూరు ఆగస్టు 26 జనసముద్రం ప్రతినిధి**

మొగల్తూరు మండలం కే పీ పాలెం నార్త్ గ్రామంలో బొక్క వారి వివాహ కార్యక్రమం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించాన తెలుగుదేశం పార్టీ నర్సాపురం నియోజకవర్గం ఇన్చార్జి పొత్తూరి రామరాజు వెంట కడలి మోహన్ రావు నీటి సంఘం అధ్యక్షులు, బొక్క పెద్దిరాజు, బొక్క ఏడుకొండలు నాగిడి రాంబాబు. బొక్క దుర్గ రావు, నేతల కనందాసు, బొక్క సూర్య నారాయణ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగష్టు 26 :**

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై జగన్మోహన్ రెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి అభూత కల్పనలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. విపత్తులను ఎదుర్కొనే దూరదృష్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఎల్ నినో, వర్షాభావ పరిస్థితులపై అసెంబ్లీలో చర్చ పెడితే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో రైతాంగానికి తీరని నష్టం వాటిల్లినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు.

సాగునీటి రంగానికి ఊతం

గతంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులకు దాదాపు 13,500 కోట్లు కేటాయించామని, హంద్రీ-నీవా, పట్టిసీమ, వెలిగొండ పనులను వేగవంతం చేసి రైతులకు నీరందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను 2029 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

వైసీపీ పాలనలో బీసీ రిజర్వేషన్లను తగ్గించి అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం రాజ్యసభ స్థానాల్లో 50 శాతం బీసీలకే ఇచ్చి గౌరవించిందని తెలిపారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రక్రియను చేపట్టి ఎన్నికల హామీలను నిలబెట్టుకున్నామని తెలిపారు. అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

## ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మాణం: నాదెండ్ల మనోహర్

గవర్నర్ ప్రసంగానికి ఉభయ సభలు కలిసేందుకు సెంట్రల్ హాల్, శాసన ప్రక్రియపై అవగాహన కోసం ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నట్లు వివరించారు.



పర్యావరణ హిత ప్రాంగణం

ప్రాంగణమంతా ఆహ్లాదకరంగా ఉండేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రపంచస్థాయి శాసనసభ భవనాన్ని ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు.

## ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారు:

హైదరాబాద్: ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారని, ప్రభుత్వమే ప్రజల ఆస్తుల పాలిట కబ్జాదారుగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు (ఝతీఱంష్ట్ర తీఝశీ) విమర్శించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

"గతంలో కేసీఆర్.. ప్రజలు కేంద్రంగా పాలన సాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూములు కేంద్రంగా పాలన సాగిస్తోంది. కేసీఆర్ సీఎం కాగానే.. ముందుగా ప్రజల సమస్యలపై దృష్టి సారించారు. తాగునీరు, విద్యుత్, హైదరాబాద్‌లో ట్రాఫిక్ వంటి సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించారు. ప్రాజెక్టుల నిర్మాణంతో వరి దిగుబడిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది. కేసీఆర్ ప్రతి ఆలోచన పేదల సంక్షేమం కోణంలోనే చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎక్కడ భూములున్నా.. వెంటనే అమ్మేస్తోంది. రెండున్నరేళ్లలో రూ.30వేల కోట్ల విలువైన భూములు అమ్మారు. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు కూడా లేకుండా భూములు అమ్ముతున్నారు. ఇప్పుడు ప్రజల భూములను కూడా 22ఏలో చేర్చి ఇబ్బందిపెడుతున్నారు. ప్రజల నుంచి భూములు సేకరించి తన అనుచరులకు కట్టబెడుతున్నారు"అని ఆరోపించారు.

## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

మొదటిపేజీ తరువాయి

మాదాపూర్: ప్రపంచస్థాయి కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు తొలి ఎంపికగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గతేడాది రాష్ట్రంలోకి 75 జీసీసీలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది నాటికి మరో 100 సెంటర్లను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఆక్టేవ్ ఇంటెలిజెన్స్ సంస్థ హైటెక్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. నగరంలో కేవలం ఐటీ మాత్రమే కాకుండా స్పోర్ట్స్ టెక్నాలజీ, మీడియా, హాస్పిటాలిటీ, క్యాపిటల్ మార్కెట్స్, ట్రేడింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాలకు చెందిన కంపెనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు.

ఆక్టేవ్ సీఈవో మటియాస్ స్టెన్‌బర్గ్ మాట్లాడుతూ.. తమ సంస్థ తదుపరి వృద్ధి దశను కొనసాగించడానికి హైదరాబాద్ అన్నివిధాలా అనువైన ప్రదేశం అన్నారు. ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ ప్రతిభ, శక్తివంతమైన టెక్నాలజీ ఎకో సిస్టమ్, బలమైన ఆవిష్కరణల సంస్కృతి.. హైదరాబాద్ సొంతమన్నారు. ఆక్టేవ్ ఇండియా ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొనిదెన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ సెంటర్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్, ఏఐ, డేటా, క్లౌడ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అంశాల్లో సేవలు, ఆవిష్కరణలు ఉంటాయన్నారు

## ఏడు రైలు మార్గాలు.. నాలుగు లైన్లుగా విస్తరణ: అశ్వినీ వైష్ణవ్

దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే ఏడు కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించింది. ఈ మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దీనికి సంబంధించి 'ఎక్స్' వేదికగా ఆయన వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులో పెరగనున్న ప్యాసింజర్, సరకు రవాణా డిమాండ్‌ను నెరవేర్చేందుకు, తక్కువ ట్రాన్స్‌పోర్ట్ వ్యయం, పర్యావరణహితమైన రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ఈ విస్తరణ కీలకమని పేర్కొన్నారు.

"దిల్లీ-హావ్‌డా, హావ్‌డా-చెన్నై, చెన్నై-ముంబయి, ముంబయి-దిల్లీ, దిల్లీ-చెన్నై, ముంబయి-హావ్‌డా, దిల్లీ-గువాహటి.. ఈ ఏడు రైలు మార్గాలు హైడెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగం. ఇవి 11 వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. దేశ రైల్వే నెట్‌వర్క్‌లో వీటి వాటా 16 శాతంగానే ఉన్నప్పటికీ.. మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో 41 శాతం రాకపోకలు ఈ మార్గాల్లోనే సాగుతున్నాయి. ఈ మార్గాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల నాలుగు లైన్లు ఉన్నాయి. మొత్తం నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం పెంపు సాధ్యమవుతుంది" అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## సీజేపీ నిరసనల తర్వాత..

మొదటిపేజీ తరువాయి

దీని ఫలితం ఇన్‌స్టాగ్రామ్ లో కనిపించినట్లు 'డేటా బిగిన్స్' అనే సంస్థ నివేదికలు వెల్లడించాయి. ఈ సమయంలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీల ఇన్‌స్టా ఎంగేజ్‌మెంట్ రేట్స్ భారీగా పెరిగినట్లు తెలిపాయి. నిరసనలకు ముందు.. జులై 20 తర్వాత గణాంకాలను క్రోడీకరించి ఈ డేటాను వెలువరించాయి.

నివేదికల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఎంగేజ్‌మెంట్ రేట్ (అత్యధిక వ్యూస్, లైక్స్, షేర్స్, కామెంట్స్) 289.9శాతం పెరిగింది. ఆయన తర్వాతి స్థానంలో 180.7శాతంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలిచారు. నిర్ణీత సమయంలో వీరు వరుసగా వీడియోలు షేర్ చేయడంతో అగ్ర నేతల ఖాతాలకు ఆదరణ బాగా పెరిగినట్లు తెలుస్తోంది. వీరితో పాటు వీరి పార్టీ ఖాతాల వ్యూస్ సైతం పెరగడం గమనార్హం.

ఈ నిర్ణీత కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ఖాతాను ఎక్కువ మంది వీక్షించారు. దీంతో ఆయన ఒక్కో పోస్టుకు ఎంగేజ్‌మెంట్ 1,190,000 నుంచి 4,630,000లకు పెరిగింది. మునుపటి స్థాయి కంటే ఇది దాదాపు 3.9 రెట్లు ఎక్కువ. రాహుల్ గాంధీ ఖాతా వీక్షణల్లోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఆయన సగటు ఎంగేజ్‌మెంట్ (×అర్ఘుస్త్రతీఖఎ వఅస్త్రుఘుస్త్రవఎవత్) 1,52,000 నుంచి 4,26,000లకు పెరిగింది. యువతను ఆకట్టుకోవడానికి, రాజకీయ దృష్టిని ఆకర్షించడానికి ఇన్‌స్టాగ్రామ్ ప్రధాన సోషల్ మీడియా వేదికగా కొనసాగుతోంది.

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

మొదటిపేజీ తరువాయి

"రాష్ట్రవ్యాప్త ఏజెంట్ల నెట్‌వర్క్ ద్వారా ఒక్కో ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేసినట్లు నాకు సమాచారం అందింది. ఈ విషయం కమిషన్‌కూ తెలుసు. కానీ.. ఒక్క అభ్యర్థికే ఆ ప్రశ్నపత్రం అందినట్లు చెబుతోంది. ఇది కమిషన్ విశ్వసనీయతకు సంబంధించిన అంశం. కమిషన్ ఛైర్మన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి" అని రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై తాను సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిశానని భాజపా ఎమ్మెల్యే అభిమన్యు పవార్ తెలిపారు. ప్రశ్నపత్రం లీక్‌ను సీఎం తీవ్రంగా పరిగణించారని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

పరీక్ష నిర్వహణకు ముందే ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం అందినట్లు పోలీసు విచారణలో ప్రాథమికంగా తేలిందని అంతకుముందు ఎంపీఎస్సీ వెల్లడించింది. ఈ అంశం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నియామక ప్రక్రియను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ పరీక్ష రద్దు.. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అభ్యర్థులకు దక్కిన విజయంగా కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వడెట్టీవార్ పేర్కొన్నారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

మొదటిపేజీ తరువాయి

**కుప్పం, చిత్తూరు ఫలితాలు**



కుప్పం, చిత్తూరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలుతో అద్భుత ఫలితాలు వచ్చాయని అధికారులు సమీక్షలో వివరించారు. చిత్తూరులో హైపర్‌టెన్షన్ నియంత్రణ 56 శాతం, డయాబెటిస్ తీవ్రత 16 శాతం తగ్గాయని తెలిపారు. ప్రాథమిక వైద్య సేవల వినియోగం గణనీయంగా పెరిగిందని, సర్వేలో పాల్గొన్న 91 శాతం మంది ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని తెలిపినట్లు పేర్కొన్నారు.

**ఏఐ ఆధారిత సేవలు**

స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు పూర్తిస్థాయి ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముందస్తు వ్యాధి గుర్తింపు, నివారణ, తక్కువ ఖర్చుతో కూడిన మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, అధికారులు పాల్గొన్నారు.

## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

**మార్కాపురం, ఆగష్టు 26 :**

ఈ నెల 31న మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కాబోతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభించనున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన ఫీడర్ కెనాల్ రెగ్యులేటర్ గేట్ల పనులతో పాటు ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చే ఘాట్, సభా స్థలి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాసితుల కాలనీలను సందర్శించి మౌలిక వసతులపై కలెక్టర్, అధికారులకు సూచనలు చేశారు. 7 వేల నిర్వాసిత కుటుంబాల త్యాగఫలితంగానే లక్షలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతోందని ఆయన కొనియాడారు.

నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

గత ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే 768 కోట్లు చెల్లించిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సొంతిళ్లు కట్టించే బాధ్యత

ముంపు గ్రామాల నిర్వాసితులకు రేషన్, పెన్షన్ వంటివి నిరంతరం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసిత కుటుంబాలు ఇళ్లు కట్టుకుని గృహప్రవేశాలు చేసే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత

మొదటిపేజీ తరువాయి

కీసర: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత.. పార్టీ నాయకుడి ఇంటి ఆడబిడ్డగా మారారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి చీర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బాలప్రసాద్-శివాని వివాహాన్ని ఆమె చేతుల మీదుగా జరిపించారు. తన ఇంటి ఆడబిడ్డ హోదాలో పెళ్లి చేయాలని బాలప్రసాద్ కోరారు. వారి సామాజికవర్గ ఆచారం ప్రకారం వరుడు వధువుకు తాళి కట్టే ముందు ఆడపడుచు.. పసుపు కొమ్ముతో మూడుముళ్లు వేస్తారు. సంప్రదాయం ప్రకారం కవిత గౌరీ పూజలో పాల్గొని అనంతరం వధువు మెడలో పసుపు కొమ్ముదారంతో మూడుముళ్లు వేశారు. ఒడిబియ్యం పోసి పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు.

## పగిడి జీడయ్య యాదవ్ ను పరామర్శించిన బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్..

**దామరచర్ల మండలం.ఆగష్టు 26.(జనసముద్రం న్యూస్):**
మండల కేంద్రానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జిడయ్య యాదవ్ వారి తండ్రి పగిడి లింగయ్య ఇటీవల అకాల మరణం చెందగా విషయం తెలిసిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య వారి తనయుడు బిసి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ పగిడి జీడయ్య యాదవ్ స్వగృహానికి చేరుకొని లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు,అనంతరం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పగిడి జీడయ్య యాదవ్ ఆర్ కృష్ణయ్య వారి అడుగుజాడలలో గత 20 సంవత్సరాలుగా నడుస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేస్తూ అనేక పోరాటాలు చేస్తూ విద్యార్థులకు మరియు సమాజంలో అలాగే ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తిన తక్షణమే స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని



పరిష్కరించడంలో ఎప్పుడు వెనకాడరని వారి తండ్రి పగిడి లింగయ్య చనిపోవడం బాధను కలిగించిందని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు,అలాగే బడుగు బలహీన వర్గాల పేద ప్రజలందరూ రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే ఈ రాష్ట్రం ఈ దేశం అభివృద్ధి చెందినట్లు అని మన దేశానికి స్వాతంత్రం వచ్చి సుమారు 80 సంవత్సరాలు పూర్తయినప్పటికీని బీసీలలో ఇంకా అనేక కులాలు వారు అసెంబ్లీలో అడుగు పెట్టకపోవడం దురదృష్టమని అన్నారు,అదేవిధంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య గత 47 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటంలో బీసీ జాతి రాజకీయంగా ఆర్థికంగా,సామాజికంగా, అభివృద్ధి చెందాలని బడుగు బలహీన వర్గాల ప్రజలు అసెంబ్లీలో అడుగు పెట్టాలని బీసీలు రాష్ట్రానికి ముఖ్యమంత్రి మరియు దేశానికి ప్రధానమంత్రి కావాలని అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు,అలాగే బీసీ యువత మొత్తం కూడా రాజకీయ రంగంలో ఉద్యమపరంగా సంఘటితమై రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలపై పోరాడి బీసీల హక్కులను సాధించుకోవాలని అన్నారు,వారి వెంట బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలగాని వెంకటేష్ గౌడ్,బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మహేష్ చారి,యాదవ సంఘం నాయకులు కానసాని సోమయ్య,నన్నెబోయిన రాజు,కుర్ర వెంకన్న,గడ్డం ముత్తయ్య,జవాజి శ్రీధర్,పగిడి సైదయ్య,కాకునూరి విజయ్,కిలారి రామకృష్ణ,మైనార్టీ నాయకులు షేక్ ఘని,షేక్ మాజీద్ తదితరులు ఉన్నారు.

## మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయం కత్తి రవీందర్ రెడ్డి

**జన సముద్రం న్యూస్ । నాంపల్లి నల్లగొండ । ఆగస్టు 26**
నాంపల్లి:మానవ సేవే మాధవ సేవగా భావించి పేదలు అనాథలు నిరాశ్రయులు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి జీవితాంతం సేవలందించిన మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి అన్నాడు మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు అండగా నిలిచి కష్టాల్లో ఉన్న వారికి సేవ చేయడం ద్వారా మదర్ థెరిసా ప్రపంచానికి మానవత్వం విలువను చాటిచెప్పారని అన్నారు.మతం కులం ప్రాంతం అనే భేదాలు లేకుండా అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సేవ చేయడమే తన జీవిత ధ్యేయంగా మదర్ థెరిసా పనిచేశారని పేర్కొన్నారు ఆమె చూపిన సేవా మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయమని



అన్నారు మదర్ థెరిసా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని పేదలు బలహీన వర్గాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కత్తి రవీందర్ రెడ్డి అన్నారు

## శుభోదయం పత్రిక ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీష్ రావు..





**జనసముద్రం న్యూస్ (జగిత్యాల జిల్లా) ఆగస్టు 26**
జగిత్యాల పట్టణానికి చెందిన పాత్రికేయుడు నార్ల పరశురాం ఎడిటర్ గా ప్రారంభమైన శుభోదయం భారత్ దినపత్రిక మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా హైదరాబాదు లోని ఆయన నివాసంలో ఆవిష్కరించడమైనది .. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో శుభోదయం భారత్ ఒక ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించాలని, ప్రజా సమస్యలను ,ఎప్పటికప్పుడు ఎలాంటి పక్షపాతం లేకుండా చూపాలని, వార్తలను సేకరించే క్రమంలో ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని ముందుకెళ్లాలని , ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ సమాజ శ్రేయస్సు పై దృష్టి పెట్టాలని ఒక మంచి పత్రికగా పేరు సంపాదించాలని అన్నారు.. పత్రికా యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ జి ఆర్ దేశాయ్ పడాల శ్రీనివాస్ మానాలకిషన్ రాగుల పరుశురాం గౌడ్ గార్లు పాల్గొన్నారు

## మదర్ తెరిసా సేవలు చిరస్మరణీయం...

**-సేవకు ప్రతిరూపం అమ్మ మదర్.**
**-కళ్యాణదుర్గంలో మదర్ థెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కి విజ్ఞప్తి.**
**-ఘనంగా మదర్ థెరిస్సా జయంతి వేడుకలు....**

**కుందుర్పి ఆగస్టు 26 జన సముద్రం..**
విశ్వమాత నోబెల్ గ్రహీత, భారత రత్న మదర్ థెరిసా 111వ ,జయంతి వేడుకలు ను ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం అని వక్తలు కొనియాడారు. .రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత, అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సహా అధ్యక్షులు చల్లా కిషోర్ చౌదరి ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ.మదర్ థెరిసా ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగిన సేవా భావం మూర్తిభవయించిన గొప్ప మహిళ అన్నారు. ఆమె, దేశాన్ని, జన్మనిచ్చిన్న తల్లిని కూడా విడచి కలకత్తా మహానగరంలో కుష్ఠు రోగులకు సేవలాందిస్తూ సేవకు ప్రతిరూపంలా నిలిచి లక్షలాదిమంది నిరాశ్రాయులకు, వితంతులకు, అనాధులకు, అంధులకు దరి చేర్చుకొని "నిర్మల్ ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రపంచఅత్యున్నత పురస్కారం "నోబెల్ ను స్వీకరించడం చాలా గర్వంగా ఉందని అన్నారు. రోమ్ గవర్నమెంట్ "సెయింట్ హుడ్ "తో సత్కరించడం, భారతదేశం "భారత రత్న "తో ఇలా విశ్వ వ్యాప్తంగా అందరి హృదయ లల్లో స్థిర స్థాయిగా నిలిచిన "మదర్ థెరిసా జీవితం ఎందరికో ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఆమె త్యాగం, ప్రేమ గూర్చి నేటి తరం యువతీ యువకులకు, విద్యార్థులకు తెలియడానికి ప్రభుత్వవారు అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వినియోగదారుల సంఘ గౌరవఅధ్యక్షులు ,చల్లా, రాజశేఖర్ చౌదరి, పెన్షనర్స్ అసోసియేషన్ ,అధ్యక్షులు మల్లికార్జున,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కిరణ్ చౌదరి,మదర్ థెరిసా మహిళా సంఘ అధ్యక్షురాలు, సెలిన చౌదరి,ప్రో ఎవైన్ జిమ్ ఫౌండర్ ,నవీన్, వివిధ ట్రస్టు ల నిర్వాహకులు, బద్దె నాయక్, లోకేష్ యాదవ్, విజయ్ బాబ్జి, రోజ్జీ, బిషప్ జాన్సన్ బాబు, పాస్టర్స్ ఐసయ్య, డి ఎన్, పాల్, అర్థర్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు .తొలత మదర్ థెరిస్సా చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు, కళ్యాణదుర్గం శాసన సభ్యులు, అమిలినేని, సురేంద్ర బాబు మదర్ థెరిస్సా విగ్రహం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## ఘనంగా కొవ్వలి నాయుడు జన్మదిన వేడుకలు





**నరసాపురం ఆగస్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
నరసాపురం పట్టణంలోని స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముస్లిం మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు, తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు పాల్గొని కేక్ కట్ చేసి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొత్తూరి రామరాజు మాట్లాడుతూ, కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు ప్రజా సేవలో ముందుంటూ, కొవ్వలి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హర్షికేతన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కు ఘన ఆహ్వానం

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర 26,**
కలెక్టర్ దివాకర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు కూరపాటి సురేష్ చమార్ హర్షికేతన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ కు ఆహ్వానం – అభినందించిన జిల్లా కలెక్టర్ దివాకర్
మధిర లో సేవా కార్యక్రమాలే లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు కానున్న హర్షికేతన్ ఫౌండేషన్ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర్ గారికి ఘనంగా ఆహ్వానం పలికారు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ కూరపాటి సురేష్ చమార్ గారు.
ఈరోజు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ దివాకర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, ఫౌండేషన్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలు, విద్య, వైద్య,





సామాజిక సేవా లక్ష్యాలను కలెక్టర్ గారికి వివరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ హర్షికేతన్ ఫౌండేషన్ సేవా ఆలోచనను అభినందిస్తూ, ఇలాంటి సేవా సంస్థలు సమాజానికి ఎంతో అవసరమని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారని కూరపాటి సురేష్ చామారు గారు తెలిపారు.
అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ "పేద విద్యార్థులకు చదువు, నిరుపేదలకు అండగా నిలవడం, సామాజిక చైతన్యమే లక్ష్యంగా హర్షికేతన్ ఫౌండేషన్ ను ప్రారంభిస్తున్నాం. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం మాకు గర్వకారణం" అని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.
ఇట్లు
కూరపాటి సురేష చమారు
వ్యవస్థాపకులు, హర్షికేతన్ ఫౌండేషన్ ఎవశ్రీశ్రీ
90591 33918

## కడ్తాల్ టోల్‌గేట్ వద్ద మహేశ్వరం ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలు





**కడ్తాల్ న్యూస్ (ఆగస్ట్ 26)జనసముద్రం**
కడ్తాల్ టోల్‌గేట్ వద్ద బుధవారం మధ్యాహ్నం మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను ఆపి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పరిస్థితి తదితర అంశాలను పరిశీలించారు.
రోడ్డు భద్రతలో భాగంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద ఇటీవలి కాలంలో మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## రైతులకు అండగా "మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

**చింతపల్లి, ఆగస్టు 26 (జనసముద్రం న్యూస్ ప్రతినిధి):**
చింతపల్లి మండలం కుర్మేడు గేట్ వద్ద రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మరియు వ్యవసాయ అవసరమైన వస్తువులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మన గ్రోమోర్ సెంటర్ ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కంకణాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులు ఒకే చోట లభించేలా గ్రోమోర్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు అందిస్తూ రైతులు మెరుగైన దిగుబడులు సాధించేలా



నిర్వాహకులు సేవలు అందించాలని సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ వారికి అవసరమైన వ్యవసాయ సేవలను మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుర్మేడు గ్రామ సర్పంచ్ కంబాలపల్లి చెన్నమ్మ--లాలయ్య, ఉప సర్పంచ్ అనంతుల పవన్, ఆర్.ఎన్.



ప్రసాద్, గుండెబోయిన శ్రీశైలం, ఈరటి మల్లేష్, నాదిరి శ్రీశైలం, నాదిరి రమేష్, నాదిరి జంగయ్య, గౌని శేఖర్, బైరగొండ బిక్షం, అంజిబాబు, అనంతుల వెంకటయ్య, గునుగంటి శివ, కిషన్ నాయక్, కుర్మేటి భీమయ్య, వర్కాల నారయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలచెరువు రైతులకు శుభవార్త.. 29న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్**
**అశ్వాపురం ఆగస్టు 26 (జనసముద్రం న్యూస్):**
అశ్వాపురం: తుమ్మలచెరువు ఆయకట్టు రైతుల చిరకాల సాగునీటి కల నెరవేరనుంది. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఈ నెల 29న ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల నాయకుడు ఆవుల రవి తెలిపారు.ఈ పథకం ద్వారా తుమ్మలచెరువు ఆయకట్టు



రైతులకు సాగునీటి సమస్యకు పరిష్కారం లభించి, వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆవుల రవి కోరారు.

## ఎస్ఐఆర్ ఓటర్ జాబితాపై సాయిరెడ్డిగూడలో గ్రామసభ

**కందుకూరు న్యూస్ ఆగస్ట్ (26)జనసముద్రం**
సాయిరెడ్డిగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ఓటర్ జాబితాకు సంబంధించి గ్రామసభ సమావేశం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతి, సర్పంచ్ కొంగళ్ల అనిత తెలిపారు.
ఆగస్టు 27 గురువారం ఉదయం 9 గంటలకు సాయిరెడ్డిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్,



వార్డు సభ్యులతో పాటు గ్రామ ప్రజలు హాజరై ఓటర్ జాబితాకు సంబంధించిన అంశాలను పరిశీలించి, అవసరమైన సూచనలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.
గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ఓటర్ జాబితా సంబంధిత ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సహకరించాలని పంచాయతీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# .నేవీ డిపో నిర్మాణంతో సారవంతమైన భూములకు ముప్పు

**జనసముద్రం న్యూస్, కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, ఆగస్టు 26,**

నేవీ ఆయుధ డిపో నిర్మాణం మాకు వద్దు అంటూ ఆ ప్రాంత రైతులు వినూత్న నిరసన తెలియజేశారు ప్రతి రైతు పొలంలో ఆయుధం డిపో మాకు వద్దంటూ నిరసన తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఇచ్చి తమ బ్రతుకు తెరువును పాడు చేసుకోలేమని కంటతడి పెట్టారు కొంతమంది కావాలనే దురుద్దేశంతో మంగపతి దేవి పేట బోడిగూడెం బర్కేట్ నగరం ఓట్లగూడెం రేకులు కుంట గ్రామాలకు చెందిన



రైతులు ముక్తకంఠంతో వాపోయారు వారికి మద్దతుగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బొగ్గవరపు బాబురావు సంఘీభావం తెలియజేశారు ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు కావాలనే దురుద్దేశం పూర్వకంతో ఇక్కడ నేవీ డిపో నిర్మాణం చేపట్టాలని కోరుకున్నారని అది పూర్తి విరుద్ధమని వ్యవసాయమే జీవనాధారంగా పెట్టుకుని జీవిస్తున్న రైతులు పొట్ట కొట్టి వారి ఉసురు పోసుకోవద్దని ఆయన వాపోయారు తరతరాలుగా తమ వారసత్వం ప్రకారం వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్న రైతులకు మేలు చేయాలని అందుకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే ఈ ఆది డిపో నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని బాబురావు కోరారు ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి భాస్కరరావు ఎడ్లపల్లి సూర్య సంద్రం సొంగ బుచ్చయ్య తీగల దుర్గారావు ఎడ్లపల్లి బాబురావు యడ్లపల్లి ఏసోబు కానూరు శ్రీను కానూరు రాజు కే సత్యనారాయణ తానికి పెద్ద లక్ష్మి యడ్లపల్లి వెంకటలక్ష్మి దుర్గమ్మ మరియమ్మ యేసురత్నం కళ్యాణి మాణిక్యం అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మదర్ థెరిస్సా జయంతి

**తూర్పుగోదావరి/ సీతానగరం/ ఆగస్టు 26/ జనసముద్రం న్యూస్:**

మండల కేంద్రంలో వైఎస్సార్సీపీ వాలంటీర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరి పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజుతో కలిపి పలువురు నాయకులు థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి, కేక్ కట్ చేశారు. అనంతరం డాక్టర్ బాబు మాట్లాడుతూ అనాథలు, రోగులకు మదర్ థెరిస్సా అందించిన నిస్వార్థ సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఆమె స్ఫూర్తితోనే 'మదర్ థెరిస్సా సేవా సమితి', 'డాక్టర్ బాబు ఫ్రెండ్స్ సర్కిల్' ద్వారా ఇప్పటివరకు 28 వేల మందికి రక్తదానం అందించామని, తాను వ్యక్తిగతంగా 131 సార్లు



రక్తదానం చేశానని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు, నిరుపేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మట్ట వసంతరావు, పెందుర్తి దేవదాసు, దాకె రఘు, పెదపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల పెన్షన్ అసోసియేషన్ భవనం నందు జరిగిన మదర్ థెరీసా 116వ జయంతి

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగష్టు 26;**

భారతదేశపు శాంతి దూత మదర్ థెరిస్సా సేవ ప్రపంచానికే చాటి చెప్పి, మనందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మానవతా మూర్తి, త్యాగశీలి, ప్రేమామయి మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా మాచర్ల పెన్షన్ అసోసియేషన్ భవనం నందు దళిత బహుజన భీమ్సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపొగు జార్జి మాట్లాడుతూ.. ఆగష్టు 26న 1910 వ సంవత్సరంలో నార్త్ ఇండోనేషియా స్కోప్ జే లో జన్మించింది. చిన్నతనంలో తండ్రిని కోల్పోయి చదువుకొని భారతదేశానికి సంబంధించిన భారతదేశ పౌరసత్వం కోసం మిషనరీ ఆఫ్



చారిటి ని కలకత్తాలో 1950వ సంవత్సరం లో స్థాపించి 45 సంవత్సరాల పాటు మిషనరీ పాఠశాలలు, ప్రపంచంలో ఇతర దేశాలలో వ్యాప్తి చెందేలా పేదలకు, రోగులకు, అనాధలకు, క్షయ వ్యాధి గల వారికి, కుష్టు వ్యాధి గల వారికి సహాయం చేయడం జరిగింది. ఆమె చేసిన మానవ సేవకు 1979వ సంవత్సరంలో నోబెల్ శాంతి పుష్కారాన్ని పొందింది. భారతదేశం నుండి ఆమె పొందిన మొట్టమొదటి పురస్కారం పద్మశ్రీ 1962వ సంవత్సరంలో ఇచ్చారు. జవహర్ లాల్ నెహ్రూ అవార్డు 1969వ సంవత్సరంలో ఇచ్చారు. అంతర్జాతీయ అవగాహన కోసం ఆమోదించబడింది. రామన్ మెగసిస్ అవార్డు 1962వ సంవత్సరంలో అంతర్జాతీయ సేవకు గుర్తింపు లభించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, చిన్నజార్జ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ పడదగ్గ కేసుల మీడియేషన్...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. ఆగస్టు.26.**



రాజీ పడదగ్గ కేసులను మీడియేషన్ చేసే కార్యక్రమాన్ని చేపట్టామని కష్ణాజిల్లా డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ ఎస్.వరలక్ష్మి తెలిపారు. మండలంలోని విన్నకోటలో మంగళవారం మీడియేషన్ గురించి సమావేశాన్ని ఆమె ఏర్పాటు చేశారు. మీడియేషన్ ద్వారా గ్రామంలోని ఏ విధంగా రాజీ చేసుకోవాలో ఈ సమావేశంలో ఆమె తెలియపరిచారు. కార్యక్రమంలో కక్షిదారులతో పాటు రెవిన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సమీపిస్తున్న మహా పుష్కరాలు..ప్రారంభం కాని గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు



**భక్తుల్లో పెరుగుతున్న ఆందోళనలు**

**నరసాపురం ఆగష్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**







గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నరసాపురంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో స్థానికుల్లో, భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర నలుమూలల నుంచి పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ముందస్తు ఏర్పాట్లు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, ప్రొటెక్షన్ గ్రిల్స్ మరమ్మతులు, పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యాలు, భక్తుల రాకపోకలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అయితే పనులు ప్రారంభం కాకపోవడంతో పుష్కరాల సమయానికి ఏర్పాట్లు పూర్తవుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చివరి నిమిషంలో పనులు ప్రారంభిస్తే హడావుడి ఏర్పాట్లతో నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో కార్యాచరణ రూపొందించి పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు. గోదావరి పుష్కరాలకు నరసాపురం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నెల్లూరులో వైభవంగా మిలాడ్-ఉన్-నబీ

- నగర ప్రగతి, సమాజ శాంతి కోసం ప్రత్యేక దుఆలు
- మంత్రి పొంగూరు నారాయణ ఆయురారోగ్యాల కోసం మసీదులు, నివాసాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- అమరావతికి బాటలు.. మంత్రి నారాయణ కి ముస్లిం నాయకుల నిండు మనసుతో ఆశీస్సులు
- మిలాద్-ఉన్-నబీకి నెల్లూరు సిద్ధం..మంత్రి నారాయణ ఆదేశాలతో విద్యుత్ కాంతులు, పటిష్ట పారిశుద్ధ్యం
- మంత్రికి ముస్లిం సోదరుల ప్రత్యేక అభినందనలు, దైవప్రార్థనలు

**నెల్లూరు, ఆగస్టు 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

నెల్లూరు నగరవ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహం మరియు పరస్పర సామరస్యం మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు మసీదులతో పాటు అనేక నివాసాల్లోనూ ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ప్రత్యేక నమాజ్‌లు, దుఆలు నిర్వహించారు. సమాజ శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరుకుంటూ విభిన్న ప్రాంతాల నుండి ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.?ఈ శుభసందర్భంగా ముస్లిం నాయకులు మరియు ప్రజలు రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ గారిపై తమ ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. 42వ డివిజన్ అమినియా మసీదులో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు..



రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి నారాయణ గారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నివాసాల్లోనూ, మసీదుల్లోనూ ప్రత్యేకంగా దైవప్రార్థనలు చేశారు.?కూటమి ప్రభుత్వ హయాంలో మంత్రి నారాయణ ప్రత్యక్ష ఆదేశాలతో వేడుకల కోసం నగరంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యుత్తమ ఏర్పాట్లు చేశారు. మసీదుల పరిసరాలు, ప్రధాన వీధుల్లో ఎన్నడూ లేని విధంగా అత్యద్భుతమైన విద్యుత్ దీపాల అలంకరణలు (లైటింగ్స్) ఏర్పాటు చేసి పండుగ శోభను రెట్టింపు చేశారు.?అలాగే మసీదుల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య వ్యవస్థను అసాధారణ రీతిలో మెరుగుపరిచి, పరిసరాలన్నీ అత్యంత పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడంపై ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. వినూత్న ప్రజా సంక్షేమ పథకాల ద్వారా నెల్లూరు నగరాన్ని ఆధునిక స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు మంత్రిగారు చేస్తున్న కృషిని కొనియాడారు.?దీంతో పాటు, రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిలబెట్టేందుకు మంత్రి నారాయణ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను, విజన్‌ను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ నిండు మనసుతో ఆశీస్సులు అందజేశారు..ఈ కార్యక్రమంలో 42 వ డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా భాయ్,?అధ్యక్షుడు ఖలీల్ భాయ్,మైనారిటీ కార్యదర్శి కాలేషా భాయ్,?యూత్ అధ్యక్షుడు నయీమ్,?డివిజన్ కోఆర్డినేటర్ ఉమర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాదర్ హుస్సేన్,?నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు రీహానా భాను, మైనారిటీ ప్రధాన కార్యదర్శి మునజ్జా తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్సై శ్రీను నాయక్

**తూర్పుగోదావరి/ సీతానగరం/ ఆగస్టు 26/ జనసముద్రం న్యూస్**

దేశాభివృద్ధి యువతతోనే సాధ్యమని, యువకులు ఎలాంటి చెడు వ్యసనాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి జాలిమూడి గ్రామ సచివాలయంలో నిర్వహించిన 'పల్లెనిద్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక యువతతో



మాట్లాడుతూ నేరాల్లో చిక్కుకుని కేసులు నమోదైతే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలతో పాటు విదేశాలకు వెళ్లే అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ సరైన దిశా నిర్దేశం చేయాలన్నారు. డిజిటల్ యుగంలో గుర్తుతెలియని లింకులు, మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో పేకాట, సారా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో మదర్ థెరిసా జయంతి వేడుకలు...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. ఆగస్టు.26.**







లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో మంగళవారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసిన లయన్స్ ప్రతినిధులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులతో పాటు వంద మంది గర్భిణీ మహిళలకు బ్రెడ్ , బిస్కెట్లు పంపిణీ చేశారు. అడుసుమిల్లి వెంకట రమణారావు ఆర్థికసాయంతో నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ చైర్మన్ కల్యాణపు నవాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు చౌదరి, సెక్రటరీ విశ్వేశ్వరరావు, కోశాధికారి కొండయ్య, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు శుభారావు, బాలాజీ, సుధాకర్, పరంధామయ్య, రామారావు, పెరుమాళ్ళు, రాజా, చిట్టిబాబు, సత్తిరాజులు తదితరులు పాల్గొన్నారు.

## మొగల్తూరులో నియోజకవర్గ స్థాయి పీ.జీ.ఆర్.ఎస్. కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**మొగల్తూరు ఆగస్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా నరసాపురం నియోజకవర్గం స్థాయిలో 2వ ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఆగస్టు 28వ తేదీ (శుక్రవారం ) మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల స్థాయి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని ఆమె తెలిపారు. నరసాపురం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వెంకటరాజు.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు 26 ద్వారకాతిరుమల ప్రతినిధి**



**వివాహ వేడుకలలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు.**

ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం గ్రామ ఎంపీటీసీ సభ్యులు కొయ్యలమూడి వెంకట సరిత రామ్మోహన్ రావు కుమార్తె వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, రాజమండ్రి పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ఏపూరి దాలయ్య, నియోజకవర్గ నాయకులు పసుమర్తి రతీష్, మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్ కుమార్, గోపాలపురం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పాతూరి సహృదయ మండల యువ నాయకులు మొగతడకల ఓం ప్రకాష్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఘంటా శ్రీనివాసరావు, మండల ఐటీడీపీ అధ్యక్షులు ఏపూరి కిషోర్, గంటవారిగూడెం పార్టీ అధ్యక్షులు సతీష్, క్లస్టర్ ఇంచార్జి పాకలపాటి మధు, నాదెళ్ల వెంకటేశ్వరరావు, కొయ్యలమూడి రాంబాబు, కానుమిల్లి విష్ణు, పెండ్లి ప్రకాష్, బోట్ల సాయి తదితరులు పాల్గొని వధూవరులను దీవించారు.

# ఖరీఫ్ రైతు ఆశలు... అడియాశలేనా?

● జిల్లాలో 90వేల ఎకరాల్లో విత్తు పడనట్లేనా!

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. ఆగస్టు.26.**

జిల్లాలో వ్యవసాయ సాగు దుర్భిక్షంగా మారింది. 4.12లక్షల ఎకరాల్లో రైతులు పంటలను జిల్లాలో సాగు చేయవలసి ఉంది. కాని అందులో 90వేల ఎకరాల్లో ఆగస్టు నెల పూర్తి కావస్తున్నా... సాగునీరందక పంటలు వేయకుండా ఆ భూములను రైతులు ఖాళీగా వదిలేశారు. ఆ ఖాళీగా ఉన్న భూముల్లో మొలిచిన గడ్డిని పశువులు మేస్తున్నాయి. ఒకవేళ పంటలు వేసినా ఆ రైతులు మాత్రం సాగునీరందక నానా తంటాలు పడి మనశ్శాంతిని కోల్పోతున్నారు. ఆయిల్ ఇంజన్ల సాయంతో నీటిని తోడుకుంటూ... ఆ పంటలను కాపాడుకునేందుకు చేతి చమురు వదిలించుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఈ ఏడాది సాగునీరు రాదులేనని తమకు తామే స్వచ్ఛందంగా క్రాప్ హాలిడేను ప్రకటించుకున్నారు. సాగు ఆరంభంలో అయితే కొన్ని చోట్ల అయితే కడుపు మండిపోయి ఆకుమళ్లను తగులబెట్టుకున్న రైతులు కూడా లేకపోలేదు. ప్రస్తుతం సాగవుతున్న పంటలకు సాగునీరు సవ్యంగా అందక పోవటంతో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్లులా కలుపు సమస్యలు తలెత్తుతూ...తామున్నామంటూ పలకరిస్తున్నాయి. ఈ నెల వరకే ఎల్‌నినో ప్రభావం ఉంటుందన్న వాతావరణ ప్రకటనలు కూడా వ్యవసాయ రైతులను మోసం చేశాయి. వాతావరణ పరిస్థితుల రీత్యా ఆ తర్వాత అయినా వర్షాలు పడతాయని రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కోటి ఆశలతో ఇప్పటివరకు పంటలు సాగు చేస్తూ...వచ్చారు. తీరా వచ్చే ఏడాది రబీ చివరి వరకు ఎల్‌నినో సంక్షోభం తప్పదన్న వాదనలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎల్‌నినో తీవ్రతపై కూటమి ప్రభుత్వానికి ముందుగానే అవగాహన ఉన్నా...రైతు సంక్షేమం కొరకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవటం కడు



శోచనీయం. ప్రచార్భాటంగా సీఎం చంద్రబాబు మాత్రం కష్ణాడెల్టాలోనే తప్ప మరొక ప్రాంతంలో ఎక్కడ కూడా వరి సాగు చేయకూడదన్న మాటలు నీటి మీద రాతలుగా మారాయి. కష్ణాడెల్టాలో వేలాది ఎకరాల్లో వ్యవసాయ సాగు చేయక పోవటమే అందుకు నిదర్శనం. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎదుగుదల సన్నగిల్లుతోంది. పైరు ఎదగకపోగా కొత్తగా అత్యధికమైన కలుపు రైతులకు తలనొప్పిగా మారిపోయి, అధిక ఖర్చు కల్పిస్తోంది. పంటల పరిస్థితిపై ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. సర్వే నంబర్ల వారీగా అంచనా వేసేందుకు 'రైతన్నా మీ కోసం' చేపట్టింది. నిత్యం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పంటలు ఎన్ని హెక్టార్లలో సాధారణ స్థితి, ఎన్ని హెక్టార్లలో ఎండిపోయాయన్న సర్వేను బందాలుగా విడిపోయి సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. వరితో పాటు వేరుశనగ, కంది, పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు చెందిన పైరుల్లో ఏ మాత్రం ఎదుగుదల కనబడటం లేదు. దీనితో ఈసారి పంటల దిగుబడులు దిగజారిపోయే అవకాశాలు ఎక్కువగా కనబడుతున్నాయి. ఎల్‌నినోతో వర్షాలు లేవని సీఎం చంద్రబాబు వరి వేయవద్దని చెబుతూనే...ఎందుకు సాగు వద్ది రేట్లను ప్రకటిస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కంటి మీద కునుకు కరవు...



-- త్రిపురనేని సురేష్‌బాబు, అంగలూరు మాజీ ఉప సర్పంచి

రైతులకు సాగు ఆరంభం నుంచి ఈనాటి వరకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఇప్పుడు ఎల్‌నినో ఇబ్బందులు తలెత్తాయి. పంటల ఆరంభంలో సాగునీటి విడుదల నుంచి ఎరువుల పంపిణీలో కూడా సవ్యంగా జరగలేదు. ఇప్పటికీ రాత్రింబవళ్లు ఇంజన్లతో సాగునీటి తోడకాలకు మాకు కంటి మీద కునుకు లేదు.

ఎటూ తేల్చని కూటమి...

-- పెన్నేరు ప్రభాకరరావు, వడ్లమన్నాడు రైతు క్లబ్ కన్వీనర్

వరిసాగు విషయంలో రెండు నాలుకల ధోరణితోనే ముందు నుంచి కూటమి ప్రభుత్వం రైతులతో ఆటలు ఆడుతుంది. పంట వేశాక వరిసాగు వద్దని ప్రకటించిన ప్రభుత్వానికి ఎల్‌నినో గురించి వరి వేయమన్నపుడు ముందుగా తెలియదా? రైతులకు ఎలాంటి సంక్షేమ చర్యలు తీసుకున్నారో...ప్రకటించక పోవటం విడ్డూరం.

నానా అగచాట్లు...

-- బలుసు జితేంద్ర, వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీల కన్వీనర్

పంట సాగు చేస్తేనేమో సాగునీరు అందదు. ఏదో తిప్పలు పడి...ఆయిల్ ఇంజన్లతో కాల్వల్లో అందని సాగునీటిని పొలానికి తోడుకుని పెడితే...కలుపు సమస్యలు తప్పటం లేదు. ఎల్‌నినోతో వర్షాలు పడక పంటలు ఎండిపోతున్నాయి. సాగు చేయకుండా భూమి వదిలేస్తేనే...రైతులకు మేలుగా కనబడుతోంది.

# అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మహిళా బాస్కెట్‌బాల్ పోటీలను వీక్షించిన

**ఏపి స్పోర్ట్స్ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, రవీంద్రనాథ్**

**జనసముద్రం న్యూస్ కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, ఆగస్టు 26,**



అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మహిళా బాస్కెట్‌బాల్ పోటీలను శాప్ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, రవీంద్రనాథ్ వీక్షించారు. అంతరం ఆమె మాట్లాడుతూ, ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రతిభను, ఆటలో వారి నైపుణ్యాన్ని, పట్టుదలను వారు ఆసక్తిగా పరిశీలించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న మహిళా క్రీడాకారులను అభినందిస్తూ, క్రీడల్లో గెలుపోటముల కంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి ఎంతో ముఖ్యమని తెలిపారు.మహిళా క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అమరావతి ఛాంపియన్షిప్ ద్వారా క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభిస్తోందని తెలిపారు.

# గూడూరు లో ఘనం గా మిలాది-ఉన్-నబీ..

**ముఖ్య అతిథి గా ఎమ్మెల్యే. పాశిం.**

**నెల్లూరు, ఆగస్టు 26, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**



భవంతుని పై విశ్వాసన్ని కేవలం ప్రార్ధనకెపరిమితం చేయకుండాపేదలకుసేవచేయడం ద్వారాఅచరణలో చూపించవచ్చునని ఎమ్మెల్యే.పాశిం.సునీల్ కుమార్ అన్నారు.

ఆయన బుధవారం గుడూరుపట్టణంలోని పి.యస్.అర్ పార్క్ వీధి నందు ముస్లిం మత పెద్ద లతో కలసిమిలాది -ఉన్ -నబీ శుభాకాంక్షలు తో ఒక్కక్కోరి తెలుపుతూ ప్రత్యేక ప్రార్ధన జరిపారు. ముస్లిం సోదరులతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసుకుంటున్న మసీద్ నిర్మాణ ప్రారంభం కార్యక్రమంలో ఎమ్మెల్యే. పాశిం. సునీల్ కుమార్ తో ముస్లిం మత పెద్దలు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో కలసి ప్రార్ధన జరిపిఅనంతరం నిరుపేద లకు అన్నదానంచేశారు.

ఈ కార్యక్రమం లో ముస్లిం మత పెద్ద లు. ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# డిండిలో ఘనంగా పోచమ్మ బోనాల పండుగ







**జనసముద్రం న్యూస్ ఆగస్టు 26: డిండి :-**

నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలో ప్రతి ఏటా శ్రావణమాసంలో నిర్వహించుకునే పోచమ్మ బోనాల వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.మొదటి బోనాన్ని కోట మైసమ్మ వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.అనంతరం బొడ్రాయి వద్దకు చేరుకొని అభిషేకంతో కూడిన పూజలు నిర్వహించారు.గ్రామంలోని ముదిరాజ్,యాదవ,రెడ్డి, ఆర్యవైశ్య తదితర మహిళలు, ఆడపడుచులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను ఎత్తుకొని డబ్బు చప్పుళ్ళు, డీజే పాటల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి అమ్మవారికి పూజలు చేసి,నైవేద్యం సమర్పించి తమ మొక్కలను చెల్లించుకున్నారు.ఈ బోనాల వేడుకలో పోతురాజుల విన్యాసాలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లగంతుల రవి,వార్డు సభ్యులు,మాజీ ఎంపీటీసీ బుష్పాక వెంకటయ్య,మాజీ సర్పంచ్. మేకల సాయమ్మ, మాజీ ఉపసర్పంచి నూకం వెంకటేష్,పొలం లక్ష్మణ్. భయ్యా మల్లయ్య,ఎలకుర్తి మల్లేష్,జూలూరు వెంకటేష్, హనుమన్ల కేశవులు,బిఆర్ఎస్ మాజీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ రషీద్,కలీం,బాల్ రెడ్డి, నల్లగంతుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదో వార్డు లో వంద శాతం పూర్తైన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం : జానీ భాష

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, ఆగష్టు 26;**



మాచర్ల పట్టణంలోని పదో వార్డు, 63వ బూత్ నందు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 100% విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని పదో వార్డు 63వ బూత్ ఇంచార్జ్ షేక్ జానీ బాషా తెలియజేశారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# పారదర్శకంగా అనామలీస్ హియరింగ్...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. ఆగస్టు. 26.**



అనామలీస్ హియరింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.లోకరాజు అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన అనామలీస్ హియరింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనామలీస్‌కు సంబంధించిన అభ్యంతరాలు, వివరాలను పరిశీలించి, సంబంధిత దరఖాస్తుదారుల నుంచి అవసరమైన సమాచారం స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో శాయన ప్రకాష్, మురాల నరేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

■నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ఫోకస్

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని తీసుకుంటామని ఆయన చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన చెప్పారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి ఇకపై బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## దేవదుర్గపై ప్రత్యేక దృష్టి:



దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణ వేగవంతానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు దేవదుర్గ బ్లాక్‌ను ఒక కీలక అవకాశంగా మలచాలని అధికారులకు సూచించారు.

## అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి:

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. సింగరేణి ఇకపై కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల మైనింగ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని పేర్కొన్నారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని విధాలా సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.ప్రపంచవ్యాప్తంగా ఇంధన, పారిశ్రామిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణి అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరగనున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త అవకాశాలను గుర్తించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లోని అవకాశాల పరిశీలనకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలను పరిశీలించి సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై ముందడుగు వేయాలని సూచించారు.

## డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి:

ఒకవైపు కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే మరోవైపు సంస్థ ప్రధాన కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిలో అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే, కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, జనసముద్రం న్యూస్ ఆగస్టు:**




మల్కాజిగిరి నియోజకవర్గంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో స్థానిక శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు మరియు భక్తులతో కలిసి ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొనడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

ఈ పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్, పరశురాం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదవ్, చంద్ర మౌళి, ప్రభాకర్ గౌడ్, నర్సింగ్, మల్లేష్ యాదవ్, కేబుల్ రమేష్, శ్రీకాంత్, నవీన్, సూరి, బాలకృష్ణ, ఉమేష్, ఉమాపతి, సూర్యకుమారి తదితర నాయకులు, ముఖ్య కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘టాక్సిక్’.. ‘ధురంధర్ 2’ని క్రాస్ చేసిన మూవీ



ఎన్నో వాయిదాల తర్వాత యశ్ ‘టాక్సిక్’ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ప్రీసేల్ బుకింగ్స్‌లో రికార్డు సృష్టించింది. దీంతో ప్రస్తుతం ‘టాక్సిక్’ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.ం

**‘ధురంధర్ 2’ను బీట్ చేసిన టాక్సిక్..**

ప్రీసేల్ బుకింగ్స్‌లో ఈ సినిమా హవా చూపించింది . బ్లాక్‌బస్టర్ ‘ధురంధర్ 2’ను బీట్ చేసింది. ‘ధురంధర్ 2’ ప్రీసేల్‌లో 14 లక్షల టికెట్స్ అమ్ముడు కాగా.. ‘టాక్సిక్’ 16 లక్షలు సేల్ అయ్యాయి. ఈ భారీ ఓపెనింగ్స్‌తో మొదటి రోజు అలవోకగా రూ.100 కోట్లు సాధించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**దయచేసి షేర్ చేయకండి..**

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రిలీజ్ నేపథ్యంలో ఆగస్టు 25న రాత్రి ‘టాక్సిక్’ టీమ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ‘ఇది కేవలం సినిమా మాత్రమే కాదు.. ఎంతోమంది సాంకేతిక నిపుణులు, నటీనటులు, సిబ్బంది ఎన్నో ఏళ్లపాటు ప్రేమతో, అడుగు అడుగునా కష్టపడి నిర్మించిన ప్రపంచం. మీరు ఈ చిత్రాన్ని థియేటర్లలో బిగ్ స్క్రీన్‌పై అందరితో కలిసి వీక్షించాలని మేం కోరుకుంటున్నాం. థియేటర్లలో సినిమా చూస్తున్నప్పుడు సన్నివేశాలను మీ ఫోన్‌లలో రికార్డ్ చేసి .. సోషల్ మీడియాలో పోస్ట్ చేయద్దు. సినిమా కథని, ట్విస్టులను బయటకు చెప్పొద్దు’ అని టీమ్ విజ్ఞప్తి చేసింది.

# వివాదం వేళ.. కృతి సనన్ రాఖీ యాడ్ తొలగింపు



కృతి సనన్ నటించిన ‘రక్షా బంధన్ యాడ్’ను ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ ‘జివ’ తొలగించింది. ఈ ప్రకటనలో ఆమె ధరించిన దుస్తులపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవ్వడం, రాజకీయంగానూ చర్చనీయాంశం కావడంతో సదరు సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.దీనిపై ‘జివ’ వివరణ ఇచ్చింది. “మాకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, పండగలపై ఎంతో గౌరవం ఉంది. రాఖీ లాంటి పండగను కుటుంబమంతా చేసుకోవాలని మేం భావించాం. అందులో భాగంగానే పెంపుడు జంతువులకు కూడా ప్రేమను పంచాలనుకున్నాం. కానీ, మా యాడ్ వల్ల సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలు దెబ్బతిన్నాయి. మేం ఉద్దేశపూర్వకంగా ఇలా చేయలేదని మరోసారి స్పష్టం చేస్తూ.. ఈ ప్రకటనను అన్ని మాధ్యమాల నుంచి తొలగిస్తున్నాం. ఈ పండగను మీ అందరూ ఎంతో ఆనందంగా చేసుకోవాలని కోరుకుంటున్నాం” అని ‘జివ’ ఓ నోట్ విడుదల చేసింది రాఖీ నేపథ్యంలో ఇటీవల ఈ యాడ్‌ను విడుదల చేయగా ఇందులో కృతి వస్త్రధారణ, పెంపుడు శునకానికి రాఖీ కట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అలాంటి దుస్తులు వేసుకుని రాఖీ కట్టడాన్ని తప్పుపడుతూ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మండిపడ్డారు. సంప్రదాయ భారతీయ పండగకు ఎలాంటి దుస్తులు వేసుకోవాలో తెలియదా అంటూ ప్రశ్నించారు. ఇదే సమయంలో కృతికి రాహుల్ గాంధీ మద్దతిచ్చారు. ఆయనకు కౌంటర్ ఇస్తూ మళ్లీ కంగనా పోస్ట్ పెట్టారు. ఈ వరుస వాడీ వేడి పోస్టుల నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది.

# ధర్మన్‌లో శ్రియ?



‘పువ్వల్లే నవ్వుల్ నవ్వుల్.. నవ్వల్లే మువ్వల్ మువ్వల్.. ’ అంటూ ‘శివాజి’ చిత్రంలో ప్రేమ పాటలు పాడుతూ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు అగ్రహీరో రజనీకాంత్, శ్రియ. ఈ సినిమాతో విజయవంతమైన జోడీ అనిపించుకున్న ఈ జంట ఇప్పుడు మరోసారి తెరపైకి రాబోతుందంటే ప్రేక్షకులకు పండగే కదా! అయితే ఆ దిశగానే చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో ‘ధర్మన్’ అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా శ్రియ.. రజనీతో కలిసి ఉన్న ఫొటోను ‘హ్యాపీ డే’ అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఇందులో రజనీ ‘ధర్మన్’ సినిమా లుక్‌లో కనిపించడంతో.. ఈ చిత్రంలో శ్రియ కూడా ఓ కీలక పాత్రలో మెరవనుందంటూ ప్రేక్షకుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

# ఇద్దరు అధికారులు.. ఒకటే సత్యం




కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్, బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం ‘దాయరా’. మేఘనా గుల్జార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. వినీత్ జైన్, ధవల్ గడా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఓ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. “ఇద్దరు అధికారులు. రెండు దృక్కోణాలు. ఒకే సత్యం. ఆగస్టు 31న అధికారిక ట్రైలర్ విడుదల కానుంది” అనే వ్యాఖ్యను జోడించింది. ఈ పోస్టర్‌లో పృథ్వీ, కరీనా ఇద్దరు సీరియస్ లుక్‌లో వారి వెనక అస్పష్టంగా ఉన్న ఒక ముఖం కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. ఇద్దరు అధికారులు రెండు వేర్వేరు దర్యాప్తులతో ఒకే విధమైన సత్యాన్ని అన్వేషించడమే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా హిందీ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బ్రహ్మాస్త్ర 2 ప్రపంచంలోకి సైయారా సుందరి?



గతేడాది ‘సైయారా’తో యువతలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది బాలీవుడ్ యువకథానాయిక అనీత్ పడ్డా. ఇందులో ప్రేమికురాలిగా కనిపించి కుర్రకారుని ఉర్రూతలూగించిన ఆమె... ఇప్పుడు ‘బ్రహ్మాస్త్ర 2’ ప్రపంచంలోకి అడుగుపెట్టబోతుందట. హీరో రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న ‘బ్రహ్మాస్త్ర’కి సీక్వెల్‌గా దీన్ని అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఇందులో దీపికా పదుకొణె ఓ శక్తిమంతమైన పాత్రలో అలరించనుందని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ చిత్రంలో మరో కీలక పాత్ర కోసం అనీత్ పడ్డాను చిత్రబృందం సంప్రదించినట్లు తెలుస్తోంది. ఇంకా చర్చలు జరుగుతున్నాయని, ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ప్రేక్షకులు ఆమెను విభిన్నమైన పాత్రలో చూసి ఆశ్చర్యపోతారని బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అనీత్.. దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న ఓ రొమాంటిక్ డ్రామాతో బిజీగా ఉంది.

# యుద్ధరంగంలోకి ‘గాంధారి’



“ఈ లోకంలో కృష్ణుడు మరోసారి గాంధారిని పరీక్షించాడు. కానీ ఇప్పుడీ మహాసంగ్రామంలో స్వయంగా గాంధారినే యుద్ధరంగంలోకి అడుగుపెట్టబోతుంద”ని అంటోంది తాప్సి. మరి కుమార్తె కోసం రణరంగంలోకి అడుగుపెట్టిన ఆమె గెలిచిందో? లేదో తెలుసుకోవాలంటే ‘గాంధారి’ సినిమా చూడాల్సిందే. తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబరు 3న నెట్‌ఫ్లిక్స్‌లో రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాల వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది సినీబృందం. “మహాభారతంలో గాంధారి తన భర్త కోసం కళ్లకు గంతలు కట్టుకుంది. మరి మీ కుమార్తె కోసం మీరేం చేస్తారు?” లాంటి సంభాషణలతో, యాక్షన్ సీక్వెన్స్‌తో సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. ఇందులో అదృశ్యమైన తన కుమార్తెను రక్షించుకోవడానికి పోరాటం చేసే అంధురాలైన తల్లి పాత్రలో కనిపించనుంది తాప్సి. ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# నాగార్జున సాగర్ కుడి కాలువకు తాగునీరు విడుదల





**జనసముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 26**

పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. కుడి జలవిద్యుత్ కేంద్రంలోని మొదటి యూనిట్‌ను స్విచ్ ఆన్ చేసిన ప్రాజెక్టు ఈఈ రమేష్, జెన్‌కో అధికారులు 2,000 క్యూసెక్కుల నీటిని కుడి కాలువలోకి విడుదల చేశారు. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కుడి కాలువకు మొత్తం 8 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ నీటితో కుడి కాలువ పరిధిలోని చెరువులు, కుంటలను నింపుకుని ఆయా ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. నీటి విడుదలతో నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలను విడుదల చేయడంతో మాచర్ల నియోజకవర్గంతో పాటు కుడి కాలువ పరిధిలోని ప్రజలకు ఉపశమనం లభించనుంది. చెరువులు, కుంటలకు నీటిని మళ్లించి నిల్వ చేసుకోవడంతో రానున్న రోజుల్లో తాగునీటి సమస్యను అధిగమించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# మృతి చెందిన తండ్రీకొడుకులుకు ఘన నివాళులు..

## కళ్యాణదుర్గం,వైసిపి సమన్మయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య.





**కుందుర్పి, ఆగస్టు 26 జనసముద్రం న్యూస్ :**

కుందుర్పి గ్రామంలో మాజీ సర్పంచ్ బోయ పాతన్న, ఆయన కుమారుడు పరశురామప్ప ఇద్దరూ ఒకే రోజు కన్నుమూసిన. ఈ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని , కళ్యాణదుర్గం, వైసిపి సమన్మయకర్త, మాజీ ఎంపీ, తలారి రంగయ్య అన్నారు.

బుధవారం ఈ విషయం తెలుసుకున్న ఆయన కుందుర్పిలోని వారి నివాసానికి చేరుకున్నారు.


మృతి చెందిన తండ్రీకొడుకులు బోయ పాతన్న,, పరశు రామప్పల భౌతికకాయాలకు ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఒకే ఇంట్లో ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులను కుటుంబ యాజమాలు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ ఓదార్చారు. వారికి తన సానుభూతిని తెలియజేస్తూ,మా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక నాయకులు, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు, గ్రామస్తులును పాల్గొని ఘన నివాళులర్పించారు.

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ఘన స్వాగతం.





**నెల్లూరు, ఆగస్టు 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడికి గూడూరు రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం ఉదయం స్వర్ణ భారత ట్రస్ట్ నుంచి గంగా కావేరి ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై సెంట్రల్‌కు బయలుదేరిన వెంకయ్య నాయుడు గూడూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికి శాలువాలు, పూల బొకేలతో సత్కరించారు.

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా మాట్లాడారు. పలువురితో ఫొటోలు దిగారు. అనంతరం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం పరిసరాలను పరిశీలించి, ప్లాట్‌ఫారం సరిగా లేదని స్టేషన్ మాస్టర్‌కు సూచించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్లాట్‌ఫారం పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు పి. సురేందర్ రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ ఎస్.ఎస్. నాయుడు, సీనియర్ నాయకులు హరి నాయుడు, గూడూరు మండల అధ్యక్షుడు కే. దయాకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, గూడూరు శివాలయం చైర్మన్ బాలకృష్ణ నాయుడు, సీనియర్ నాయకులు సారంగం శ్రీనివాసులు, సీహెచ్. నిరంజన్, కే. చెంచు రెడ్డి, సంజీవ నాయుడు, రమేష్, కోట కోటేశ్వరరావు, వెంకయ్య గౌడ్, వెంకటాచలం మండల సీనియర్ నాయకులు మురళి, టౌన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డి. మధుసూదన్, టౌన్ యువ మోర్చా అధ్యక్షుడు సీహెచ్. శివ, కాల్తిరెడ్డి పోలయ్య గౌడ్, గుంజి భవాని, తూపిలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఒప్పిచర్లలో జరిగిన కార్డెన్ సెర్చ్ :- గురజాల డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మండలం, ఆగష్టు 26:**

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ లు నిర్వహిస్తున్నామని గురజాల డిఎస్పీ ఉమామహేశ్వరరావు అన్నారు. 26.8.2026 అనగా బుధవారం కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో 50 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో కారంపూడి సర్కిల్ సీఐ భాస్కరరావు, కారంపూడి ఎస్సై వాసు ఆధ్వర్యంలో ' కార్డెన్ సెర్చ్' నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను, పలు మారనాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ.. రానున్న పంచాయతీ ఎలక్షన్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాలలో అలజడులు సృష్టించి అల్లర్లు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకోవద్దంటూ యువతను కోరారు. గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కారంపూడి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

# కట్టుకున్న భార్యనే కడతేర్చిన ఉన్మాది

**నెల్లూరు, ఆగస్టు 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

మనుషుల్లో మానవత్వం లోపిస్తోంది . పలు మత్తు పదార్థాల బానిసత్వంలో ఉన్మాదులుగా మారుతున్నారు. పగపట్టి ప్రతీకార చర్యల్లో పలు రకాల అనుమానాలతో అమ్మ, ఆలీ అనే తేడా లేకుండా ప్రాణాలు తీస్తున్నారు. ఇలాంటి సంఘటనే సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు దళితవాడలో బుధవారం వెలుగులోకి వచ్చి ఆ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేసింది. వివరాలు చూస్తే కోటపోలూరు గ్రామానికి చెందిన పనబాక శ్రీనివాసులు కు తడ మండలం, కారిజాత గ్రామంలోని సంధ్య అనే మహిళతో వివాహం అయింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వీరి మధ్య కుటుంబ కలహాలు తలెత్తి సంధ్య పుట్టింటిలోని ఉండిపోయింది. కొన్ని రోజులకు స్థానిక పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి ఇరువురిని కలపడంతో కొంతకాలం కారిజాతలోనే కాపురం చేసి, తిరిగి సులూరుపేటలో అదే గృహంలో చేరారు. సంధ్య కోటపోలురు నుండి అన్నం క్యారేజీ పట్టుకుని సులూరుపేట వెళుతున్నట్లు చెప్పి వెళ్ళింది. ఎక్కడ, ఏం జరిగిందో





కానీ భర్త శ్రీనివాసులు భార్య సంధ్య మృతదేహాన్ని చీరలో మూట కట్టుకుని బుధవారం గ్రామానికి వస్తుండగా గ్రామస్తులు ఈ సన్నివేశాన్ని గమనించారు. ఓవైపు చేతులు వేలాడుతూ, మరోవైపు వెంట్రుకల కనిపిస్తూ ద్విచక్ర వాహనంలో తీసుక్ ె వెళుతున్న శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్యాభర్తల మధ్య ఉన్న కుటుంబ కలహాలతో ఉన్మాదిగా మారిన బర్తె చంపి సవాన్ని ఇంటికి చేర్చి నేనే చంపాను అంటూ అక్కడ ఉన్నవారికి తెలిపారు. మృతురాలిని ఒక్కడే చంపాడా! వేరొకరు సహాయం తీసుకున్నాడు అనే విషయాలు పోలీసుల విచారణలో వెల్లడి కానుంది.

కోటపోలూరు గ్రామ సమీపంలో ఉన్న పుచ్చ కాలవ పొలాల వద్ద సంధ్య శరీరంపై ఉన్న కొన్ని వస్తువులను ఆ ప్రాంతంలో గుర్తించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటన తెలుసుకున్న మృతి చెందిన సంధ్య బంధువులు ఆ గ్రామానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న సిఐ మురళీకృష్ణ, ఎస్ ఐ అజయ్ కుమార్ ఆ గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సులూరుపేట సిహెచ్ సి కి తరలించారు. ఈ హత్యాసంఘటన ఓ మిస్టరీ గా ఉంది. ఇది ఏమైనా ఎలా జరిగింది, ఎక్కడ జరిగింది, ఎప్పుడు జరిగింది, ఎవరెవరు సూత్రధారులు అనేది రాబట్టేందుకు పోలీసులు ముద్దాయిని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

# గిరిజన గ్రామాల రహదారి సమస్యలు పరిష్కరించాలి.

## ఏపీఎంసీడీసీ చైర్మన్ చిన్నపల్లి శ్రీనుకు జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి వినతి.

**అనంతగిరి/జనసముద్రం న్యూస్ మంగళగిరి ఆగస్టు 26:**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు చిట్టం మురళి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏపీఎంసీడీసీ చైర్మన్ చిన్నపల్లి శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా చిట్టం మురళి మాట్లాడుతూ.. పినకోట పంచాయతీ వీరభద్రపురం గ్రామం నుంచి జీనబడు పంచాయతీ వలసల గరువు వరకు సుమారు 5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి, అలాగే కొండిబ పంచాయతీ సాద జంక్షన్ నుంచి కోసమామిడి కప్పటి వలస వరకు



కొత్త రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితుల్లో గ్రామాలకు అంబులెన్స్‌లు రాక గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా వీరభద్రపురంవలసల గరువు వాసులు రైవాడ రిజర్వాయర్ మీదుగా వర్షాకాలంలో పడవలపై ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారని వివరించారు.

ఈ రహదారులు పూర్తయితే గిరిజన ప్రాంతాలకు విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మెరుగవుతాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో పరిశీలన చేయించి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి పాంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం విశ్వమాత మదర్ థెరిసా : డాక్టర్ కుక్కమూడి ప్రసాద్



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగష్టు 26;**

సేవకు ప్రతిరూపం, జీవితాన్ని సేవకే అంకితం చేసిన మాతృమూర్తి విశ్వమాత మదర్ థెరిసా అని, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరియు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ అన్నారు. బుధవారం విశ్వమాత మదర్ థెరిసా 116వ జయంతి సందర్భంగా మాచర్ల పట్టణంలోని బీసీ నవ చైతన్య వేదిక సంఘ కార్యాలయం నందు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.

**ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ..**

1910 ఆగస్టు 26న నార్త్ ఇండోనేషియా (స్కోప్జే ) నగరంలో మదర్ థెరిసా జన్మించారని, చిన్నతనంలోనే ఆమె తండ్రిని కోల్పోవడం జరిగిందని, భారతదేశానికి సేవ చేయడానికి కలకత్తా వచ్చి, కలకత్తా నగరంలోని పేదల కష్టాలను చూసి చలించిపోయిన ఆమె 1950వ సంవత్సరంలో మిషనరీ ఆఫ్ చారిటీ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి, ఆ సంస్థ ద్వారా ఈ ప్రపంచంలోని అనేకమంది నిరుపేదలకు, రోగులకు, అనాధలకు, అభాగ్యులకు శక్తివంశన లేకుండా నిస్వార్ధంగా సేవ చేశారని, నిరాశ్రాయులకు, హెచ్ఐవి ఎయిడ్స్, క్షయ వ్యాధిగ్రస్తులకు ఆశ్రయం కల్పించారన్నారు. నలుగురికి సహాయం చేయడానికి కావలసింది డబ్బే కాదు. మంచి మనసు, మానవత్వం ఉంటే చాలు అని ప్రపంచానికి చాటు చెప్పి అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మానవతావాది, త్యాగశీలి, ప్రేమామయి మదర్ థెరిసా అని, ఆమె అందించిన సేవలకు గాను ప్రపంచంలో అనేక పురస్కారాలు ఆమెకు రావడం జరిగిందని, 1979వ సంవత్సరంలో నోబెల్ పురస్కారం, 1980వ సంవత్సరంలో భారతదేశ అత్యున్నత పురస్కారం అయినటువంటి భారతరత్న వంటి అవార్డులు రావడం జరిగిందని ఆయన అన్నారు. 1997 సెప్టెంబర్ 5న ఆమె కలకత్తా నగరంలో మరణించారని, అనంతరం 2016 వ సంవత్సరంలో సెప్టెంబర్ 4న వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ ఆమెను పరిశుద్ధురాలుగా అధికారికంగా ప్రకటించటం జరిగిందని ఆయన తెలిపారు.

మదర్ తెరిసా జీవితం నేటికీ స్ఫూర్తిదాయకమని ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజానికి సేవ చేయాలన్నాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ నవచైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి ఈశ్వరయ్య , సీనియర్ దళిత నాయకులు ఆరుమళ్ళ ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకా తిరుమల స్వామివారికి రూ.92 లక్షల బంగారు కవచం సమర్పణ

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు 26 ద్వారకాతిరుమల ప్రతినిధి**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు భారీ కానుకను సమర్పించారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం వాస్తవ్యులు వేగుంట సాంబశివరావు , సౌందర్య లక్ష్మి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.92 లక్షల విలువైన 584 గ్రాముల బంగారు కవచాన్ని బంగారు హస్తములతో కూడిన వక్షస్థలం స్వయంభూ స్వామివారికి మరియు 507 గ్రాముల వెండి కవచాన్ని వెండి హస్తములతో కూడిన వక్షస్థలం బుధవారం సమర్పించారు.

ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతలకు



శ్రీ స్వామివారికి బంగారు కవచం మరియు వెండి కవచాన్ని సమర్పించిన దాతలను అభినందిస్తున్న ఆలయ అధికారులు.



స్వామివారికి కానుక సమర్పించిన కుటుంబ సభ్యులు

ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ స్వామివారి ఆశీస్సులు దాతలు మరియు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ సురానేని వెంకట సుధాకర రావు, ఈవో వేంద్ర త్రినాథరావు, ఈఈ డి.వి. భాస్కర్ ,దాతల కుటుంబ సభ్యులు చేవూరి లక్ష్మీనారాయణ, చేవూరి ఈశ్వర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# పుట్టా విజయ ప్రతాప్ రెడ్డి ని కలిసిన మురళి, ఎంఎస్ఎన్ రావు, వేణు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగష్టు 26;**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ పుట్ట విజయ ప్రతాపరెడ్డి ని మాచర్ల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మురళి, మరో సీనియర్ జర్నలిస్ట్ ఎం ఎస్ నాగేశ్వరరావు , టీడీపీ నాయకులు సంభోజు వేణు లు బుధవారం మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది.

# తిమ్మాపురంలో ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి - సిపిఐ, బికెఎంయు

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా**
**ఆగస్టు 26 ద్వారకాతిరుమల ప్రతినిధి**

ద్వారకా తిరుమల మండలం తిమ్మాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు 8 వారాలుగా బకాయి పడ్డ కూలి డబ్బులను తక్షణం చెల్లించాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డ్వామా అధికారులకు విజ్ఞప్తి చేశారు.బుధవారం బికెఎంయు మండల సమితి ఆధ్వర్యంలో తిమ్మాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ...

2005లో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం వలసల నివారణకు ఎంతో ఉపయోగపడిందన్నారు. 2014 నుండి బిజెపి ప్రభుత్వం నిధులు కోత పెడుతూ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని, 2025 చివరలో దాన్ని రద్దు చేసి జి–రామ్–జి పథకం తీసుకురావడం పేదలకు అన్యాయమని విమర్శించారు.



తిమ్మాపురంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సిపిఐ, బికెఎంయు నాయకులు

జి–...ట్టాన్ని కొనసాగించా...ర్ 1న ఢిల్లీలో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.బికెఎంయు జిల్లా సహాయ కార్యదర్శి గోలిమే బాలయేసు మాట్లాడుతూ... బకాయిలు చెల్లించకపోతే ఆందోళన చేస్తామని, ముఖమస్తరు వల్ల కూలీలకు నష్టం జరుగుతోందని, దాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యడ్లపల్లి రమేష్, దిద్దే రాణి, యడ్లపల్లి లక్ష్మి, పెండ్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన భార్య.

**-మృతుడికి ఇద్దరు కుమార్తెలు భార్య.**
**-ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.**
**-చిన్నవయస్సులోనే భర్తను కోల్పోయిన భార్య.**

**కుందుర్పి ఆగస్టు 26 జనసముద్రం న్యూస్ :**

మండల పరిధిలోని మహానంతపురం గ్రామానికి చెందిన టిడిపి పార్టీ కార్యకర్త ,యువకుడు సోమనాథ (35) రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందారు. తద్వారా మృతుడు పెద్దదిగా నిలిచిన కుటుంబ యజమాని సోమనాథ్ మృతిచెందగా ఆ కుటుంబం పెద్ద దిక్కున కోల్పోయిందని భార్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అయితే మృతి చెందిన కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆ గ్రామస్తులు కోరారు. ప్రస్తుతం మృతుడి భార్య గర్భవతిగా కొనసాగిందని ఆ గ్రామస్తులు విలేకలికి తెలిపారు.

ఏది ఏమైనా 19 ఏళ్ళ భార్యకు చిన్నవయసుకే భర్తను రోడ్డు ప్రమాదంలో కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం అని ఆ గ్రామ వాసులు ఆవేదన చెందారు.

పాత ఇల్లును పెరికి వేసి నూతన ఇల్లు నిర్మించుకోవాలని పునాదులు వేసుకుని, ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోగానే అర్ధాంతరంగా తనువు చలించడం భార్య రోదనలు వర్ణణాతీతం గా వుంది..

ప్రస్తుతం వారు అద్దె ఇంటిలో నివాసం ఉన్నారు.

# అందుబాటులోనే ఉన్న.. మాజీ ఎమ్మెల్సీ బత్యాల


**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఆగస్టు 26:**

క్రియాశీలక రాజకీయాల్లోనే ఉన్న, పార్టీపరంగా సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు తాను అందుబాటులోనే ఉన్నానని మాజీ ఎమ్మెల్సీ టిడిపి సీనియర్ నాయకులు బత్యాల చంగల్ రాయుడు అన్నారు. బుధవారం సిద్ధవటం మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ కళ్యాణ్ మండపం లో జరిగిన పెద్దపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస నాయుడు కుమారుని వివాహానికిహాజరైనబత్యాలవధూవరులనుఆశీర్వదించారు. ఈ సందర్భంగా వివాహానికి హాజరైన నాయకులతో మాట్లాడుతూ, అధికారం ఉన్న లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారం పట్ల తాను ఎప్పుడు స్పందిస్తూనే ఉంటానని ఆయన చెప్పారు. వివాహ సందర్భంగా బత్యాలతో పాటు రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఒంటిమిట్ట మండల టిడిపి నాయకులు కొమరా వెంకట నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి



మోహన్ రెడ్డి పార్లమెంట్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య, మామిళ్ళ ఈశ్వరయ్య మైదుకూరు టిడిపి నాయకుడు రామచంద్ర నాయుడు, మాజీ జెడ్పిటిసి చలమయ్య యాదవ్ ఉన్నం కిరణ్ స్వామి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని దర్శించుకున్న టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఆగస్టు 26:**

టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికిచేరుకున్నఈవోకుఅర్చకులుసాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈసందర్భంగా ఆలయఅర్చకులు శ్రీ కోదండ రామ స్వామివారి ఆలయ విశిష్టత, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని ఈవోకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డెప్యూటీఈవోఎ.ప్రశాంతి,ఏఈవో రవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహావిష్ణువు వలే పవన్ మరింత ఎదుగుతున్నారు
## మత్స్యపురిపాలెంలో జనసేన జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు





**వీరవాసరం ఆగష్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**

ఇంతితై వటుడింతై వామన రూపంలో మహా విష్ణువు ఎదిగినట్టు .. డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరింత ఎదుగుతున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలోని మత్స్యపురిపాలెం గ్రామంలో బుధవారం జనసేన పార్టీ జెండా స్థూపం, జనసేన పార్టీ జెండాను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించి మాట్లాడారు. జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనదని, పార్టీకి ఆయువు పట్టు యవత అని, వాళ్ల శక్తి అనే ఇంధనం మీదే పార్టీ నడుస్తోందని, బాధ్యతయుతమైన యువతను నాయకత్వం వైపు తీసుకెళ్లమే జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పార్టీ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని, జనసేన భావజాలాన్ని అర్థం చేసుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# కొయ్యూరు మండలం వైఎస్ఆర్సీపీ ఆత్మీయ సమావేశం విజయవంతం. భారిగా తరలివచ్చిన కార్యకర్తలు..నాయకులు
## ముఖ్య అతిథిగా పాడేరు ఎమ్మెల్యే (జిల్లా పార్టీ అధ్యక్షులు).. శ్రీ మత్స్యారాస విశ్వేశ్వరరాజు

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది ఆగస్టు 26**
**అల్లూరి జిల్లా కొయ్యూరు**

కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.. రానున్న రోజులలో స్థానిక ఎన్నికలు ప్రకటన ఉన్నందున కార్యకర్తలకు దిశా నిర్దేశం మరియు కొయ్యూరు మండలం 33పంచాయతీ లలో వైఎస్ఆర్ జెండా ఎగరవవేయాలనే లక్ష్యంగా వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు అందరికీ జోష్ ని ఇవ్వడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం

రానున్న స్థానిక ఎన్నికలలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మన పాడేరు ఎమ్మెల్యే శ్రీ మత్స్యారాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ కొయ్యూరు మండలం 33 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులను, గ్రామ వార్డు సభ్యుల ను,14 ఎంపీటీసీ సెగ్మెంట్లలో ఎంపీటీసీ అభ్యర్థులను, జడ్పీటీసీ, ఎంపీపీ అభ్యర్థులను గెలుపుగుర్రలకే స్థానిక కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు ఎంపిక చేసిన అభ్యర్థులను అధిష్టానం పరిశీలించిన తరువాత అభ్యర్థులను ప్రకటించడం జరుగుతుంది అని అన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్నీ కార్యకర్తలందరూ గౌరవించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 పంచాయతీలలో గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులను,వార్డు మెంబెర్ సభ్యులను, 14 ఎంపీటీసీ సెగ్మెంట్లలో ఎంపీటీసీ



అభ్యర్థులను,జడ్పీటీసీ, ఎంపీపీ అభ్యర్థులను కచ్చితంగా వైఎస్ఆర్ పార్టీ తరుపున ఎన్నికలలో బరిలో ఉండాలని, ముఖ్యంగా ప్రతి సర్పంచ్,వార్డు సభ్యుల, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీ అభ్యర్థులను ఏకగ్రీవం అవ్వకూడదని సూటిగా చెప్పారు.

కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను,అబద్ధపు ప్రసారాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికలలో కొయ్యూరు మండలం లో వైఎస్ఆర్ పార్టీ జెండాను ఎగురవేసి కూటమి ప్రభుత్వనికి బుద్ధి చెప్పాలని కార్యకర్తకు జోష్ నింపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ,అంబటి నుకాలమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు, మండల ఉపాధ్యక్షులు నర్సు కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, రాష్ట్ర యువజన విభాగం అచ్యుత్, స్టేట్ మహిళ విభాగం కార్యదర్శి జయతి రాజులమ్మ,జిల్లా బూత్ కన్వీనర్ పొట్టక పోతురాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గొడ్డేటి మహేష్,రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కో కన్వీనర్ గాడి అచ్చిరాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బండి సుధాకర్,సుమర్ల సూరిబాబు,నీలపు సూరిబాబు, మాజీ పోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు ,వారా నూకరాజు సతీమణి వార గంగయ్యమ్మ, గూడెం మండల పార్టీ అధ్యక్షులు గిరి, సర్పంచ్ లు. నట్టూరి సోమన్నదొర, సుర్ల చంద్రరావు, కిముడు సత్యనారాయణ, రీమల శ్రీను,బాలకృష్ణ,నెమల నుకాలమ్మ, కురుజు పెంటమ్మ, దడల రమేష్, కోడ రాజబాబు , వెంకటలక్ష్మి,తదితరులు, ఎంపీటీసీలు.. మల్లికార్జునరావు, సడ్డా మల్లీశ్వరి , నారాయణ, తదితరులు , మండల నాయకులు.. దీపం శ్రీను, ధోనీ బాబ్జీ, బంటు బుజ్జి, కాళ్ళ వసుంబాబు, రామ్మూర్తి, పాటి శేఖర్, వారా చిన నూకరాజు, మంపగాంధీ, కొండబాబు, దిలీప్, కుశల,నాగేంద్ర, పెట్ల గాంధీ , కృప, నరసింహ,తదితరులు మరియు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఐక్య అజెండాతో . గెలుపు జెండా ఎగరేస్తాం

**- తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి గిడ్డి ఈశ్వరి**

**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్ తేది ఆగస్టు 26**

అల్లూరి జిల్లా పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబ సభ్యులంతా ఐక్య అజెండాతో భవిష్యత్తులో రాబోయే ఎన్నికల్లో గెలుపు జెండాను ఎగరేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు లిశ్రీమతి గిడ్డి ఈశ్వరి ధీమా వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుట్రతో తామంతా వైఫల్యాన్ని చవిచూసామని ఈసారి అంతా ఐక్యంగా భవిష్యత్తు ఎన్నికలను ఎదుర్కోబోతున్నామని ఆమె తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులు శాతం విజయం సాధించేలా ఐక్య అజెండాతో వెళ్తున్నామని ప్రకటించారు. పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పిటిసి స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలో ఉన్న అన్ని స్థాయిల్లో నాయకులు హాజరవ్వడం ప్రత్యేకత. ఈ సమావేశాన్ని ఉద్దేశించి లిఈశ్వరి మాట్లాడుతూ కోటి మంది సభ్యులుగా ఉన్న తెలుగుదేశం పార్టీలో మనం కూడా సభ్యులుగా ఉండడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రజలకు సేవ చేయడం కోసం చంద్రబాబు



నాయుడు 76 ఏళ్ల వయసులో 365 రోజుల్లో 18 గంటల పాటు శ్రమిస్తున్నారన్నారు. మనకు అధికారమున్న సరే దాన్ని అనుభవించే అవకాశం లేదని అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో విషయం సాధించి అవకాశాన్ని, సద్వినియోగం చేసుకొని మనం అందిపుచ్చుకోవాలన్నారు. గత ఐదేళ్ల కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఇబ్బందులు భరిస్తూ వచ్చామని ఇప్పుడు అధికారం ఉన్నా సరే ఆ ఫలాలను పొందే అవకాశం లేకుండా పోయిందని స్థానిక ఎన్నికల్లో ఆ పరిస్థితిని పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పదేళ్లపాటు ప్రజల కోసం పోరాటం చేసిన వారికి సేవ చేయాలంటే అధికారం ఒకటే ఆధారమని అది దక్కితేనే మన అనుకున్న లక్ష్యాలను అనుకున్న సేవాకార్యక్రమాలను చేసే భాగ్యం లభిస్తుందన్నారు. మన అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గత పాలకులు అరెస్టు చేసినప్పుడు మనం పడ్డ ఇబ్బందులను గుర్తు చేసుకోవాలన్నారు. ఇదే ఐక్యతతో ముందుకెళ్తే స్థానిక ఎన్నికల్లో శతశాతం విజయం మనదే అని ఆమె ఘంటపదంగా చెప్పారు.

**స్మార్ట్ వర్క్ చేయండి**

సీలేరు నుంచి పాడేరు వరకు వస్తున్నారు... పాడేరు నుంచి సీలేరు వరకు వెళ్తున్నారు కానీ ఇదంతా హార్డ్ వర్క్ చేస్తున్నారు గాని ఆ పనిని స్మార్ట్ వర్క్ గా మార్చడంలో వెనకబడిపోవడం వల్ల మనం చేస్తున్న పని అధిష్టానానికి తెలియడం లేదని లిఈశ్వరి పేర్కొన్నారు. మన ప్రాంతంలో సిగ్నల్ సమస్య ఉందన్న విషయం తెలిసినప్పటికీ ప్రతిరోజు ప్రతి ఒక్కరూ 30 ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మేలును వివరించి మై టిడిపి యాప్ లో అప్ లోడ్ చేయాలని అప్పుడే మనం చేసిన పని పార్టీ గుర్తిస్తుందన్నారు. 80 వేల ఇల్లకు వెళ్లాల్సింది ఇప్పటి వరకు కేవలం 20,000 ఇళ్లకు మాత్రమే వెళ్ళామంటే మిగిలిన వరకు ఎప్పుడు పూర్తి చేయగలమో ఒకసారి ఆలోచించాలన్నారు. అసలు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభించని బూత్ లు ఇకనుంచి కనబడడానికి వీల్లేదు అన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు అన్ని రకాలుగా ప్రభుత్వం ఇప్పటికే చేసి పెట్టిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు గ్రామాలకు చేసిన మేలును వివరిస్తే చాలని ఇవి మన గెలుపుకు ఆయుధాలు అన్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకముందే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం శతశాతం పూర్తి కావాలని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చాక మనం చేసినటువంటి మంచి పనులను ప్రజలకు చెప్పేందుకు సమయం ఉండదని అందుకే త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూనే ఇంకా ఉన్న అపరిస్కృత సమస్యల పరిష్కారం కూడా తమ ప్రభుత్వమే చేస్తుందనే భరోసా కల్పించాలన్నారు. జీవో నెంబర్ 3 పైన, 1/79 చట్టం పరిరక్షణ పైన వైఎస్ఆర్సిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తీపి కొడతామని చెప్పారు.

# ప్రభుత్వ నిధులకు, సి ఎస్ ఆర్ నిధులు తోడైతే మరెంతో అభివృద్ధి :ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**నెల్లూరు, ఆగష్టు 26, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు సి ఎస్ ఆర్ నిధులు తోడైతే మరెంతో అభివృద్ధి జరుగుతుంది, ఎమ్మెల్యే విజయ్ అన్నారు.

బుధవారం తడ మండలం పూడికుప్పం గ్రామంలో సెయింట్,గోబిన్ సంస్థ సి ఎస్ ర్ నిధులు ₹4 లక్షలతో నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ ప్రారంభించారు.

చిన్నారులకు మెరుగైన వాతావరణంలో పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం మరియు సంరక్షణ సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గారు తెలిపారు.



అదేవిధంగా సెయింట్ గోబిన్ సంస్థ సి ఎస్ ర్ కార్యక్రమంలో భాగంగా పూడికుప్పం గ్రామానికి 9 సోలార్ ఎల్ఈడి లైట్లను అందించింది. గ్రామంలో రాత్రివేళ వెలుతురు సౌకర్యాన్ని మెరుగుపరచడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో పరిశ్రమల సి ఎస్ ర్ భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని, విద్య, ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి సి ఎస్ ర్ నిధులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గారు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు పరిశ్రమల సి ఎస్ ఆర్ నిధులు సహకారం తోడైతే గ్రామాల్లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించగలం. పూడికుప్పం చిన్నారుల కోసం మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించడంతో పాటు సోలార్ ఎల్ఈడి లైట్లు అందించిన సెయింట్ గోబిన్ సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు, అని ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సెయింట్ -గోబిన్ సంస్థ ప్రతినిధులు,సి డి పి ఓ జ్యోతి కిరణ్, మండల టిడిపి నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శాంతి, సోదరభావాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి: పొన్నం అనూప్ గౌడ్
## ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

**ఎల్కతుర్తి, ఆగస్టు 26 (జనసముద్రం)**

మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి పొన్నం అనూప్ గౌడ్ మండలంలోని ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, ప్రేమ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆకాంక్షించారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రైతు కుటుంబాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ప్రతి కుటుంబంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుతూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ మరోసారి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు.



## దళితులపై దాడి జరిగి ఆరు రోజులైనా అరెస్టులు లేవు. అధికారుల తీరుపై డీహెచ్‌పీఎస్ ఆగ్రహం

**- దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలి:అనిల్‌కుమార్**



ఎల్కతుర్తి, ఆగస్టు 26 (జనసముద్రం)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపురం గ్రామంలో దళితుడైన కొలుగూరి రమేష్‌పై జరిగిన దాడిని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.బుధవారం తిమ్మాపురం గ్రామానికి వెళ్లి బాధితుడు రమేష్‌ను పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ
దాడికి పాల్పడిన గ్రామ సర్పంచి ముప్పు మానస, ముప్పు మహేందర్, ముప్పు అభిరామ్‌లను ఎలాంటి ఆలస్యం లేకుండా అరెస్టు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి ఆరు రోజులు గడిచినా నిందితులను అరెస్టు చేయకపోవడం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమన్నారు.
గ్రామంలోశాంతిభద్రతలనుకాపాడాల్సినప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.సర్పంచి పాత్రపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, విచారణ పూర్తయ్యే వరకు సర్పంచిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.బాధితుడికి రక్షణ కల్పించడంతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.దాడి ఘటనలో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని వర్తించే సెక్షన్లను పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక, వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.దళితులపై దాడులు, అవమానాలు, సామాజిక బహిష్కరణ వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మారుపాక అనిల్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, రాష్ట్ర సమితి సభ్యులు రొంటాల దేవా, మర్రి శ్రీనివాస్, శేనిగరపు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా శెట్టిం ఝాన్సీ లక్ష్మి

**- మాదిగ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా**
**- సెట్టం జాన్సీ లక్ష్మి బాయి మాదిగ నియామకం**




ఆగష్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనంజయ్

ఏలూరు లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళా సదస్సు ఘనంగా నిర్వహించారు ఈ సమావేసానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు తరలివచ్చి పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేసారు. భవిష్యత్ కార్యాచరణ గురించి సమీక్షించటం జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకురాలు శెట్టిం ఝాన్సీ లక్ష్మిబాయి మాదిగ ని మాదిగ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఎంఎంఎస్ కోరు కమిటీ చైర్మన్ చౌటపల్లి విజయ మాదిగ ఎంఎంఎస్ జాతియ అధ్యక్షురాలు నంబూరు తబిత మాదిగ ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు జగ్గుల స్వతంత్ర కుమారి మాదిగ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం మహాజన మహిళా మండలి జాతీయ అధ్యక్షులు జేపీ లతా మాదిగ,జాతీయ అధికార ప్రతినిధి ఆలపాటి కరుణా మాదిగ, రాష్ట్ర అధ్యక్షురాలు వాకా జానకీ మాల, కోరుకమిటి సభ్యులు సొంగ నక్షత్ర మాదిగ, ఎంఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇనుగూరి మణెమ్మ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు ముద్దగల్ల లక్ష్మి మాల నియామక పత్రాన్ని అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.

## చిన్న మైనవానిలంకలో బోటు ప్రమాదం



Dunna raju s/o ramana a/ 32, c/sc Madiga, muggupeta, gati, jagannadhapuram, Kakinada. 8121524705



Pesangi jaggarao s/o bhramanandam a/66 c/ agni kula Kshatriya, near police station, Yanam.

**- బోటులో ఉన్న మత్స్యకారులను కాపాడిన అధికార యంత్రం**
**- ఇసుకలో కూరుకుపోయిన చేపల బోటు**
**- స్థానిక మత్స్యకారుల సాయంతో ఏడుగురు మత్స్యకారుల సురక్షితం**

నరసాపురం ఆగస్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

నరసాపురం మండలం చినమైనవాణిలంక సముద్రతీరంలో చేపల బోటు ఇసుకలో కూరుకుపోయి నిలిచిపోయింది. ఈ ఘటనలో బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న నరసాపురం రెవెన్యూ, పోలీసు అధికారులు వెంటనే స్పందించారు. స్థానిక మత్స్యకారుల సహకారంతో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. బోటులో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. స్థానిక మత్స్యకారులు సకాలంలో స్పందించి సహాయక చర్యల్లో పాల్గొనడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఏడుగురిని రక్షించగలిగారు. ఈ సందర్భంగా అధికారులను స్థానిక ప్రజలు

94941 84136
fb/janasamudram
www.janasamudram.com
www.epaper.janasamudram.com
youtube / janasamudram.com
BABA FLEX PRINT & STICKER LINE

## 40 ఏళ్లుగా పల్లీలుబెల్లమే ఆహారం

జగిత్యాల జిల్లా బ్యూరో (జన సముద్రం)

రాయికల్: రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన కాజమ్మ అనే మహిళ గత 40 సంవత్సరాలుగా పల్లీలు, బెల్లం తింటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం ఆమె వయసు 65 సంవత్సరాలు.
కుటుంబ కలహాల కారణంగా అత్తగారింటికి వెళ్లిన సమయంలో ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో పల్లీలు, బెల్లం తినడం ప్రారంభించినట్లు కాజమ్మ తెలిపారు. "నువ్వు మీ అత్తగారింటికి వెళ్లకపోతే అన్నం తినడం బంద్ చేయ్.. నువ్వు లావుగా ఉన్నావు" అని చెప్పడంతో, ఆకలి తీర్చుకోవడానికి ఆ కాలంలో తక్కువ ధరకు లభించే పల్లీలు, బెల్లం కొనుగోలు చేసి వాటినే ఆహారంగా తీసుకోవడం ప్రారంభించినట్లు



ఆమె వివరించారు.
ఎప్పుడైనా అన్నం ఆహారంగా తీసుకోవడానికి ప్రయత్నించారా అని అడిగితే.. అన్నం తనకు అరగడం లేదని ఆమె సమాధానం ఇచ్చారు.
తాను తీసుకునే ఆహారాన్ని కూడా తక్కువ మోతాదులోనే తీసుకుంటానని తెలిపారు. ప్రస్తుతం వయసు పెరగడంతో పళ్లు ఊడిపోవడంతో పల్లీలు, బెల్లాన్ని మెత్తగా చేసుకుని తింటున్నట్లు ఆమె చెప్పారు.
బాస గంగా మల్లయ్య మాట్లాడుతూ: కాజమ్మ గత 40 సంవత్సరాలుగా పల్లీలు, బెల్లం మాత్రమే ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆమె వయసు 65 సంవత్సరాలు కావడంతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ఆమెకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాజమ్మ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామీజీ ఆశీర్వాదం పొందిన అర్చక సంఘం ప్రతినిధులు

## జగద్గురువుల అనుగ్రహంతో సమాజ అభివృద్ధికి కృషి:సదానిరంజన్ సిద్ధాంతి



ఎల్కతుర్తి, ఆగస్టు 26 (జనసముద్రం)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురం శ్రీ పశుపతినాథ్ దేవస్థానం ఆలయ అర్చకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ..
వీరశైవ జంగమ దూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు బిచ్కుంద సంస్థానానికి చెందిన శ్రీ శ్రీ శ్రీ ష బ్రా 108 సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామీజీ వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు.
ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొంగళ్ళమటం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సదానిరంజన్ సిద్ధాంతి, రాష్ట్ర కోశాధికారి విభూది ప్రభులింగం తదితర సంఘ సభ్యులు స్వామివారిని కలిసి సంఘ కార్యకలాపాలు, లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ గురించి వివరించారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు వీరశైవ జంగమ దూప దీప నైవేద్య అర్చకుల సంక్షేమం, ఆధ్యాత్మిక అభివృద్ధి, సంప్రదాయ పరిరక్షణతో పాటు వీరశైవ జంగమ సమాజ అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను మహాస్వామీజీకి వివరించారు. సంఘం ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు, అర్చకుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషి, సమాజాన్ని మరింత సంఘటితం చేసేందుకు చేపడుతున్న చర్యలను తెలియజేశారు.మహాస్వామీజీ స్వామివారిని సంఘ ప్రతినిధులు దర్శించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సంఘం సభ్యులందరూ ఐక్యతతో పనిచేసి వీరశైవ జంగమ సమాజ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు.
సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంతో పాటు జంగమ అర్చకుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ధార్మిక సేవలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అర్చకులుకేవలం దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించే వారిగానే కాకుండా, సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా సేవలందించాలని మహాస్వామీజీ సూచించారు.
ధర్మం, ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని హితబోధ చేశారు. సంఘ సభ్యులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే మరింత బలమైన సంఘటిత వ్యవస్థను నిర్మించవచ్చని పేర్కొన్నారు.అనంతరం మహాస్వామీజీ సంఘ ప్రతినిధులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించి, ధార్మిక సేవల్లో నిబద్ధతతో కొనసాగాలని ఆశీర్వదించారు. వీరశైవ జంగమ సమాజ అభివృద్ధి కోసం సంఘం చేపట్టే కార్యక్రమాలకు జగద్గురువుల సంపూర్ణ అనుగ్రహంఉంటుందనిఆశీర్వచనం అందించారు.
ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు గొంగళ్ళమటం రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానిరంజన్ సిద్ధాంతి, రాష్ట్ర కోశాధికారి విభూది ప్రభులింగం మహాస్వామీజీకి కృతజ్ఞతలు తెలిపారు.స్వామివారి సూచనలు, ఆశీర్వచనాలను స్ఫూర్తిగా తీసుకుని అర్చకుల సంక్షేమం, వీరశైవ జంగమ సమాజ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గంగాధర్,సతీష్,నాగభూషణం, శివప్రసాద్ బిచ్కుంద సంస్థానానికి చెందిన సభ్యులు, భక్తులు, అర్చక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ టెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఒత్తిడి రహిత జీవన విధానంపై అవగాహన కార్యక్రమం

జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి ఆగస్టు 26

న్యూ టెన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, అలుగురాజు పల్లి లో కళాశాల సిబ్బంది కోసం బెంగళూరుకు చెందిన ఆర్ట్ ఆఫ్ లీవింగ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాడు లిఒత్తిడి రహిత జీవనంలిఅనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ట్ ఆఫ్ లీవింగ్ కోఆర్డినేటర్లు సురేష్, వినయ్ మరియు సత్యసాయి విద్యా విహార్ మాచర్ల, కార్యదర్శి అనిల్ కుమార్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కె. సురేష్ మాట్లాడుతూ ఒత్తిడి అంటే ఏమిటి?, ఒత్తిడికి ప్రధాన కారణాలు దాని ప్రభావం ఎలా ఉంటుంది! , రోజువారి జీవన విధానంలో ఒత్తిడిని ఏ విధంగా జయించాలి



మొదలగు విషయాలపై సిబ్బందికి వివరించారు. ప్రశాంతమైన జీవన విధానం , శ్వాసకు సంబంధించిన సాధనాలు, సానుకూలమైన ఆలోచన విధానాలు, ధ్యానం వంటి అంశాలు పాటించడం వల్ల ఒత్తిడిని జయించవచ్చు అని తెలిపారు.
అనంతరం కే సురేష్, టి వినయ్ ఆధ్వర్యంలో ఒత్తిడిని అధిగమించేందుకు ఉపయోగపడే సాధనాలను ప్రత్యక్షంగా చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపల్ నరసింహారావు, వైస్ ప్రిన్సిపల్ బి. నరసింహారావు, ఏవో ఖాసీం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలి, విధులలో సమర్థత పెంపొందించుకోవటానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## రహదారిపై నిలిచిన వర్షపు నీరు

**- రహదారి పక్కనే ఆక్వా చెరువుల నిర్మాణం.. సర్వీస్ బోదే ఆక్రమణ**
**- పట్టించుకోని అధికారులు**
**- ప్రమాదం అంచున ప్రయాణం**



నరసాపురం ఆగస్టు 26 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్

దర్భరేవు వంతెన సమీపంలో ఘటన నరసాపురం దర్భరేవు వంతెన సమీపంలో రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనే ఆక్వా చెరువుల నిర్మాణం చేపట్టడంతో నీరు వెళ్లే సర్వీస్ బోదే ఆక్రమణకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్వా చెరువులకు పర్మిషన్లు మంజూరు చేస్తున్న అధికారులు కనీసం ప్రదేశాన్ని సందర్శించకుండా ఇష్టానుసారంగా కాసులు మత్తులో పర్మిషన్లు మంజూరు చేస్తున్నారని స్థానిక ప్రజలు ప్రయాణికులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు.
వర్షం పడిన ప్రతిసారి నీరు రహదారిపైకి చేరి రోజుల తరబడి నిలిచిపోతుండటంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రహదారి పక్కన ఉన్న కాలువలు, నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణకు గురికావడంతో వర్షపు నీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వీస్ బోదే ఆక్రమణలను గుర్తించి ఆ క్రమనలను తొలగించి చెరువుకు సర్వీస్ బోదు ఏర్పాటు చేసేలా రైతులను ప్రేరేపించి సమస్య పరిష్కరించాలని రహదారిపై నిలిచే వర్షపు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.
ఆక్వా చెరువుల నిర్మాణాలకు నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఉన్నాయా లేదా అన్న అంశంపై కూడా అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.




Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram